మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మంగళవారం TUESDAY 16-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 348 Issue: 348

16 జూన్ 2026 - మంగళవారంశ్రీ పరాభవ నామ సంవత్సరంఉత్తరాయణం - గ్రీష్మ ఋతువుజ్యేష్ఠ మాసం - శుక్లపక్షంసూర్యోదయం - తె. 5:45సూర్యాస్తమయం - సా. 6:47తిథివిదియ రా. 12:55ం వరకుతరువాత తదియసంస్కృత వారంభౌమ వాసరఃనక్షత్రంఆరుద్ర సా. 4:13 వరకుతరువాత పునర్వసుయోగంవృద్ధి రా. 12:33ం వరకుకరణంభాలవ మ. 2:42 వరకుకౌలవ రా. 12:55ం వరకువర్జ్యంరా. 2:54 నుండి తె. 4:20 వరకుదుర్ముహూర్తంఉ. 8:22 నుండి ఉ. 9:14 వరకురా. 11:11 నుండి రా. 11:54 వరకురాహుకాలంమ. 3:32 నుండి సా. 5:10 వరకుయమగండంఉ. 9:01 నుండి ఉ. 10:39 వరకుగుళికాకాలంమ. 12:16 నుండి మ. 1:54 వరకుబ్రహ్మముహూర్తంతె. 4:09 నుండి తె. 4:57 వరకుఅమృత ఘడియలుఉ. 7:40 నుండి ఉ. 9:04 వరకుఅభిజిత్ ముహూర్తంఉ. 11:50 నుండి మ. 12:42 వరకుగమనిక: "ం" అనగా మరుసటి రోజున




తప్పుడు ఆరోగ్య సలహాలు..
ప్రమాదకర డైట్ ట్రెండ్లు..
హింసాత్మక వీడియోలు..
సాఫ్ట్ పోర్న్ కంటెంట్లు..
సోషల్ మీడియా తెరిస్తే చాలు..
అన్నీ అవే వీడియోలు..
నిద్రపోతున్న అధికారం..!
చెడిపోతున్న కౌమారం..!!

సోషల్ మీడియా కేవలం వినోద వేదిక మాత్రమే కాదు, పిల్లల ఆలోచనలు, అలవాట్లు, మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే శక్తివంతమైన సాధనంగా మారింది. అయితే అదే వేదికలు ఇప్పుడు యుక్తవయస్కులకు నకిలీ ఆరోగ్య సలహాలు, అతివాద మగతనాన్ని ప్రోత్సహించే సందేశాలు, సాఫ్ట్ పోర్న్, స్వీయ హానిని ప్రేరేపించే కంటెంట్‌ను అందిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

# అరచేతిలో.. విషం!

## హింసను ప్రేరేపించే కంటెంట్.. ప్రతి చోటా సాఫ్ట్ పోర్న్ వీడియోలు

### తప్పుడు ఆహార నియమాల రీల్స్.. చెత్త కుప్పలా సోషల్ మీడియా.. నిద్రమత్తులో జోగుతున్న ప్రభుత్వాలు

13, 15 ఏళ్లకే సోషల్ మీడియా అందుబాటులోకి రావడం అత్యంత ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా సోషల్ మీడియా ఆల్గోరిథమ్‌లు చిన్నారులకు అనుచిత కంటెంట్‌ను చేరవేస్తుండటం గమనార్హం. ఎలాంటి ప్రత్యేక శోధనలు చేయకుండానే హింస, నకిలీ వైద్య చిట్కాలు, శరీరాకృతి మార్పులపై ఒత్తిడి, లైంగిక కంటెంట్ వంటి అంశాలు రీల్స్, ఫీడ్స్‌లో కనిపిస్తున్నాయి.

(ఈవార్తలు స్పెషల్ డెస్క్)

"డీటాక్స్", "కొలన్ క్లెన్స్", "వజైనల్ హెల్త్ జ్యూస్", "పారాసైట్లను తొలగించే చికిత్స" వంటి శాస్త్రీయ ఆధారాలు లేని సూచనలు యువతకు విస్తృతంగా చేరుతున్నాయి. కొన్ని పోస్టులు సాధారణ శారీరక ప్రక్రియలనే వ్యాధులుగా చిత్రీకరిస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నాయి. అంతే కాదు, "వారం రోజుల్లో 5 కిలోలు తగ్గండి", "యాంటీ క్యాన్సర్ డైట్", "ఆందోళనను పూర్తిగా తొలగించే సప్లిమెంట్లు" వంటి నిరాధార ప్రచారాలు కూడా విస్తృతంగా కనిపిస్తున్నాయి. ఇలాంటివి శారీరక నష్టంతో పాటు తరువాయి 2 వ పేజీలో...



# 16 ఏళ్లలోపు.. సోషల్ మీడియా బంద్!

### బ్రిటన్ ప్రభుత్వం కీలక నిర్ణయం


### పిల్లల మానసిక ఆరోగ్యమే లక్ష్యం

### జూలై నుంచి చట్టం అమలు

### బ్రిటన్ ప్రధాని కీర్ స్మార్టర్ వెల్లడి

బ్రిటన్‌లో 16 ఏళ్లలోపు చిన్నారులు సోషల్ మీడియాను ఉపయోగించకుండా నిషేధించాలని అక్కడి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆన్‌లైన్ ప్రపంచంలో పిల్లల మానసిక ఆరోగ్యాన్ని, భద్రతను కాపాడటంతో పాటు వారికి ఆరోగ్యకరమైన బాల్యాన్ని అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు ప్రధాని కీర్ స్టార్మర్ సోమవారం ప్రకటించారు.

లండన్: డౌనింగ్ స్ట్రీట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రధాని కీర్ స్టార్మర్ మాట్లాడుతూ, "మన పిల్లలను విఫలం చేస్తున్న వ్యవస్థకు స్వస్తి పలికే సమయం ఆసన్నమైంది. ఈ నిర్ణయం ద్వారా పిల్లలకు వారి బాల్యాన్ని తిరిగి అందిస్తున్నాం" అని పేర్కొన్నారు. టెక్ దిగ్గజాల ప్రభావం నుంచి చిన్నారులను రక్షిస్తూ, వారి సురక్షితమైన వాతావరణంలో ఎదిగేందుకు ఈ నిషేధం దోహదపడుతుందని ఆయన వివరించారు. ఇప్పటికే ఆస్ట్రేలియాలో తరువాయి 2 వ పేజీలో...



# చిక్కదు.. దొరకదు!

### డీఆర్డీవో క్రూజ్ మిస్సైల్ ప్రయోగం విజయవంతం

### స్వదేశీ పరిజ్ఞానంతో వ్యవస్థ అభివృద్ధి

భారత్ రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ డీఆర్డీవో మరో ఘనత సాధించింది. పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన లాంగ్ రేంజ్ ల్యాండ్ అటాక్ క్రూయిజ్ మిసైల్ (ఎల్ఆర్ఎల్ఏసీఎం)ను ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి విజయవంతంగా పరీక్షించింది. ఈ ప్రయోగంలో నిర్దేశించిన అన్ని లక్ష్యాలను క్షిపణి విజయవంతంగా చేరుకుందని రక్షణ మంత్రిత్వ శాఖ పరిశోధన విభాగం వెల్లడించింది.

పూరి: ఎల్ఆర్ఎల్ఏసీఎం ఒక సబ్‌సోనిక్ ఉపరితల–ప్రయోగ క్రూయిజ్ క్షిపణి. ఇది చాలా దూరంలో ఉన్న భూభాగ లక్ష్యాలను అత్యంత ఖచ్చితత్వంతో ఛేదించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. తక్కువ ఎత్తులో భూభాగ ఆకృతులను అనుసరిస్తూ ప్రయాణించే ఈ క్షిపణి శత్రు రాడార్లకు చిక్కకుండా లక్ష్యాన్ని చేరుకోగలదు. టర్బోజెట్ ఇంజిన్, అధునాతన ఇనర్షియల్ నావిగేషన్ వ్యవస్థ, ఉపగ్రహ ఆధారిత మార్గనిర్దేశక సాంకేతికత, తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,153 |
| వెండి (కిలో): | రూ.2,80,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,248 |

# కిషన్ రెడ్డే అడ్డు

### ఆయన వెనుక కేటీఆర్.. మెట్రో-2కు అడ్డంకులు

### లోన్ రాకుండా పుల్లలు.. సీఎం రేవంత్ మండిపాటు



హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు ఆలస్యంపై.. కేంద్ర ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ కోసం ఎల్ అండ్ టీ నుంచి ఫస్ట్ ఫేజ్ మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. దానికోసం ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ)ను లోన్ ఇవ్వాలని కోరామని.. తీరా అది మంజూరు అయ్యేసరికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అడ్డు పడ్డారని ఆరోపించారు.

హైదరాబాద్, జూన్ 15 (ఈవార్తలు): సచివాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి.. కిషన్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. మెట్రో విస్తరణకు ఎల్అండ్‌టీ ఒప్పుకోవడం లేదని.. తొలి దశ మెట్రోతోనే ప్రతీ సంవత్సరం రూ. 400 కోట్ల నష్టాలు వస్తున్నట్లు ఆ సంస్థ చెప్పిందని పేర్కొన్నారు. ఎల్అండ్‌టీ నుంచి మెట్రోను కొనుగోలు చేస్తేనే సమస్య తీరుతుందని కేంద్రం చెప్పిందని గుర్తు చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. ఈ కొనుగోలులో యూపీ మెట్రో ఎండీ సుశీల్ కుమార్‌ను కూడా సభ్యుడిగా పెట్టినట్లు తెలిపారు. రూ. 30 వేల కోట్ల ఎల్అండ్‌టీ ఆస్తుల్ని రూ. 15 వేల కోట్లకు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం మెట్రోకు కిలోమీటర్‌కు తరువాయి 2 వ పేజీలో...

# రేవంత్ అసమర్థుడు

### మెట్రో ఫేజ్-2కూ అనుమతి తేలేకపోయారు


### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టును కేంద్రం నుంచి సాధించలేక, తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే రేవంత్ రెడ్డి ఇన్ని కుప్పిగంతులు తొక్కుతున్నారని, అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి తన అసమర్థతను దాచుకోవడానికి అనేక అబద్ధాలు ఆడుతున్నారని విమర్శించారు.


హైదరాబాద్, జూన్ 15 (ఈవార్తలు): యూపీ, అహ్మదాబాద్, వైజాగ్ వంటి నగరాలకు కేంద్రం మెట్రోలను మంజూరు చేస్తుంటే, హైదరాబాద్‌కు ఎందుకు తీసుకురాలేక పోయారో ముందుగా ప్రజలకు జవాబు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ విషయమై కేటీఆర్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి అసమర్థ పాలనకు నిదర్శనం మెట్రో రెండవ దశకి అనుమతి దక్కకపోవడం అన్నారు. 71 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టినప్పటికీ, మీ 'బడే భాయ్'ని మెప్పించి ప్రాజెక్టును ఒప్పించలేక పోవడం మీ చేతకానితనానికి, దద్దమ్మ పాలనకు నిలువెత్తు నిదర్శనమని విమర్శించారు. రాష్ట్రం ప్రతిపాదించిన మెట్రో విస్తరణకు అనుమతి ఇవ్వని కేంద్రం పైన ముఖ్యంగా ప్రధానమంత్రిని -2 వ పేజీలో...

## విశ్వవాణి



2026 ఫిఫా ప్రపంచకప్‌లో నెదర్లాండ్స్‌తో జరిగిన తమ తొలి మ్యాచ్ అనంతరం జపాన్ అభిమానులు మరోసారి తమ క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను చాటిచెప్పారు. మ్యాచ్ ముగిసిన తర్వాత స్టేడియాన్ని వెంటనే వీడకుండా, ప్రేక్షకుల గ్యాలరీల్లో ఉన్న చెత్తను ఏరి శుభ్రం చేశారు. 1998లో తమ తొలి ఫిఫా ప్రపంచకప్ నుంచి ప్రతి టోర్నమెంట్‌లో మ్యాచ్‌లు ముగిసిన తర్వాత స్టేడియాలను శుభ్రం చేశారు. అప్పటి నుంచి ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. జపాన్ ఫుట్‌బాల్ ఆటగాళ్లు కూడా మ్యాచ్ అనంతరం డ్రెస్సింగ్ రూమ్‌లను శుభ్రంగా ఉంచి వెళ్లడం ఆనవాయితీగా పాటిస్తుంటారు.

# ఒప్పందం పూర్తయ్యింది



### ఇరాన్‌తో డీల్ విజయవంతం

### శుక్రవారం నుంచి హర్మూజ్ ఓపెన్

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

పారిస్: పశ్చిమాసియాలో గత కొద్ది నెలలుగా కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతలకు ముగింపు పలికేలా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌తో శాంతి ఒప్పందం పూర్తయ్యిందని, ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి శుక్రవారం నుంచి పూర్తిగా తెరుచుకోనుందని వెల్లడించారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ట్రంప్.. 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం పూర్తయ్యింది. అందరికీ అభినందనలు. ప్రస్తుత ఇరాన్ లీడర్లు తెలివైన వాళ్లు.. అందుకే ఒప్పందానికి ఒప్పుకున్నారు. హర్మూజ్ జలసంధిని ఎలాంటి టోల్ లేకుండా తెరవడానికి అనుమతి ఇస్తున్నాను. అదే సమయంలో అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని కూడా వెంటనే తరువాయి 2 వ పేజీలో...

# అవగాహన ఒప్పందమే

## ప్రస్తుతానికి అవగాహన ఒప్పందమే

### మాకింకా అమెరికాపై అపనమ్మకమే.. ఇరాన్ తాజా ప్రకటన



టెహ్రాన్: ట్రంప్ ప్రకటనపై ఇరాన్ కాస్త భిన్నంగా స్పందించింది. ప్రస్తుతం కుదిరింది కేవలం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) మాత్రమేనని, అసలు ఒప్పందంపై చర్చలు ఆ తర్వాత అమల్లోకి వచ్చే 60 రోజుల కాల్పుల విరమణ సమయంలో జరగనున్నాయని స్పష్టం చేసింది. అమెరికాపై తమకు ఇంకా అపనమ్మకం కొనసాగుతోందని మరోసారి పేర్కొంది. కాగా, ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయోతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు ముందు కాల్పుల విరమణ అమల్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. జూలై 4న టెహ్రాన్‌లోని ఇమామ్ ఖమేనీ మొసల్లా ప్రార్థనా మందిరంలో వీడ్కోలు కార్యక్రమాలు తరువాయి 2 వ పేజీలో...



## సివిల్స్ (ప్రిలిమినరీ) పరీక్ష ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా లక్షలాది మంది అభ్యర్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్ష 2026 ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తన అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచింది. సివిల్స్ (మెయిన్) పరీక్షకు అర్హత సాధించిన వారి రోల్ తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు
16.6.2026

మేషం: దూరపు బంధువుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. చేపట్టిన వ్యవహారాలు అనుకూలంగా సాగుతాయి. వ్యాపారాల విస్తరణకు నూతన ప్రణాళికలు అమలు చేస్తారు. గృహ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి.

వృషభం: ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి. ఇంటా బయటా నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. వృధా ఖర్చులు పెరుగుతాయి. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. దైవ చింతన కలుగుతుంది. వ్యాపారాలు కొంత మందగిస్తాయి. ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు పెరుగుతాయి.

మిధునం: గృహమున కొన్ని ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటు చేసుకుంటాయి. విలువైన వస్తువులు బహుమతులుగా పొందుతారు. సమాజంలో ప్రముఖుల సహాయ సహకారాలు అందుతాయి. వ్యాపారమున లాభాలు పెరుగుతాయి. నిరుద్యోగ సమస్యలు తొలగుతాయి. ఉద్యోగమున ఉన్నతి కలుగుతుంది.

కర్కాటకం: ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుతుంది. కీలక సమయంలో కుటుంబ సభ్యుల సహాయం అందుతుంది. బంధువులతో సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపార, ఉద్యోగాలలో మరింత ఉత్సాహంగా రాణిస్తారు.

సింహం: ఆర్థిక పరిస్థితి అంతగా అనుకూలించనప్పటికి అవసరానికి ధనం అందుతుంది. సోదరులతో ఆస్తి వివాదాలు కలుగుతాయి. కొన్ని కార్యక్రమాలు వాయిదా పడతాయి. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఉద్యోగమున చికాకులు పెరుగుతాయి.

కన్య: భూ సంబంధిత వివాదాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. చేపట్టిన పనులలో అధిక శ్రమతో అల్ప ఫలితం పొందుతారు. వ్యాపారమున పెట్టుబడుల విషయంలో పునరాలోచన చెయ్యడం మంచిది. విద్యార్థుల పరీక్ష ఫలితాలు నిరాశ కలిగిస్తాయి.

తుల: చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. ఊహించని రీతిలో నిరుద్యోగులకు అవకాశములు అందుతాయి. ఉద్యోగాలలో అనుకున్నది సాధిస్తారు. జీవిత భాగస్వామితో దైవ దర్శనాలు చేసుకుంటారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఆర్థిక వ్యవహారాలు అనుకూలిస్తాయి.

వృశ్చికం: నూతన భూ గృహ యోగమున్నది. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపార,ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. మొండిబాకీలు వసూలవుతాయి. ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. చాలాకాలంగా వేదిస్తున్న సమస్యలు పరిష్కారమౌతాయి.

ధనస్సు: ప్రయాణాలు వాయిదా పడతాయి. చేపట్టిన పనులలో శ్రమ మరింత పెరుగుతుంది. ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేస్తారు. ఋణదాతల ఒత్తిడితో నూతన ఋణాలు చెయ్యవలసి వస్తుంది. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగాలలో కొందరి ప్రవర్తన శిరోబాధను కలిగిస్తుంది.

మకరం: కుటుంబ సభ్యులతో అకారణంగా తగాదాలు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్త అవసరం. అనుకున్న వ్యవహారాలలో స్వల్ప ఆటంకాలు ఉంటాయి. వ్యాపారాలు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. ఉద్యోగాలలో రావలసిన అవకాశాలు చేజారుతాయి.

కుంభం: వృత్తి ఉద్యోగాలలో మీ సేవలకు తగిన గుర్తింపు లభిస్తుంది. విలువైన వస్తు లాభాలు పొందుతారు. సన్నిహితులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. గృహమున మిత్రులతో మరింత ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో సమస్యలు అదిగమిస్తారు.

మీనం: చేపట్టిన పనుల్లో అవాంతరాలు తప్పవు. కుటుంబ సభ్యుల నుంచి ఊహించని మాటలు వినవలసి వస్తుంది. వ్యాపారాలు మందగిస్తాయి. బంధువులతో మాటపట్టింపులుంటాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. ఉద్యోగమున కొన్ని వ్యవవహారాలలో అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి.



# అరచేతిలో విషం!

మొదటి పేజీ తరువాయి

మానసిక ఆరోగ్యంపైనా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. అతిగా కండలు పెంచుకోవడం, మహిళలపై వివక్ష భావాలను ప్రోత్సహించడం, "నిజమైన మగాడిగా మారాలి" అనే పేరుతో హింసాత్మక సందేశాలు, టెస్టోస్టెరోన్ పెంచే మందుల ప్రచారం ఎక్కువగా కనిపిస్తోంది. కొన్ని వీడియోల్లో కత్తులు, దాడులు, నేరాలకు సంబంధించిన దృశ్యాలు కూడా అల్గారిథం చూపిస్తోంది.

### మానసిక ఆరోగ్యంపై ఆందోళన

డిప్రెషన్, ఆందోళన, ఆటిజం, బైపోలార్ వంటి సమస్యలకు సంబంధించిన వందలాది వీడియోలు వరుసగా కనిపిస్తున్నాయి. కొన్ని ఉపయోగకరమైన సమాచారాన్ని అందించినప్పటికీ, ఒకే అంశాన్ని నిరంతరం చూపించడం వల్ల యువత తమను తాము ఆ సమస్యలతో అనుసంధానం చేసుకునే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తినే అలవాట్లలో లోపాలను ప్రోత్సహించే పోస్టులు, స్వీయ హానికి సంబంధించిన వీడియోలు, ఆత్మహత్యకు సంబంధించిన సమాచారం కనిపిస్తోందని, ఈ తరహా కంటెంట్ మానసికంగా బలహీనంగా ఉన్న యువతపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

### సులభంగా సాఫ్ట్ పోర్న్

టీనేజ్ ఖాతాల్లో శృంగార మోడల్స్ ఫాలో అవడం, "ప్రైవేట్ షోలు చూడండి", "ప్రత్యేక ఫోటోలు పొందండి" అంటూ కనిపించే ఆహ్వానాలు ఒక ఎత్తు. అశ్లీల నటీనటుల లైవ్ స్ట్రీమ్‌లు, లైంగిక సూచనలతో కూడిన వీడియోలు కనిపించడం మరో ఎత్తు. గతంలో తాము ఎన్నడూ ఆ కంటెంట్ చూడకున్నా, అనేక సామాజిక మాధ్యమాల్లో యాప్ ఫీడ్ లోనే ఇలాంటివి వస్తున్నాయని నెటిజన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు, చిన్న పిల్లలు చూస్తున్న సమయంలోనూ అశ్లీల దృశ్యాలు తెరపై కనిపిస్తున్నాయని పేర్కొంటున్నారు.

### ప్రభుత్వాలు ఇకనైనా మేల్కోవాలి

చిన్నారుల భద్రత కోసం సోషల్ మీడియా సంస్థలపై మరింత కఠినమైన బాధ్యతలు విధించాలని పలు వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. పిల్లలకు హానికర కంటెంట్ చేరకుండా అడ్డుకోవడంలో విఫలమైతే టెక్ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాలను బలోపేతం చేయాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సోషల్ మీడియా సంస్థలు తమ వేదికల్లో చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని, హానికర కంటెంట్‌ను తొలగించడం, టీనేజ్ ఖాతాలపై ప్రత్యేక పరిమితులు అమలు చేయడం, సున్నిత అంశాల కోసం సహాయక వనరులను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపాయి. అయినప్పటికీ, వాస్తవ వినియోగంలో ఇంకా అనేక లోపాలు కనిపిస్తున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.



# 16 ఏళ్లలోపు.. సోషల్ మీడియా బంద్!

మొదటి పేజీ తరువాయి

అమలవుతున్న విధానం స్ఫూర్తితో ఈ నూతన పాలసీని తీసుకువస్తున్నారు. దీని ప్రకారం టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్, స్నాప్‌చాట్, ఎక్స్ వంటి ప్రధాన ప్లాట్‌ఫామ్‌లపై 16 ఏళ్లలోపు వారికి ప్రవేశం ఉండదు. లైవ్ స్ట్రీమింగ్, అపరిచితులతో సంభాషించడం వంటి ఫీచర్లపై కూడా ఆంక్షలు అమలవుతాయి. ఈ నిర్ణయానికి ముందు ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో దాదాపు 90 శాతం మంది తల్లిదండ్రులు ఈ నిషేధానికి మద్దతు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని పలువురు స్వాగతిస్తున్నారు. చిన్నారుల రక్షణలో ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని ఎన్ఎస్‌పీసీసీ వంటి స్వచ్ఛంద సంస్థలు పేర్కొన్నాయి. ఆన్‌లైన్

కంటెంట్ కారణంగా తన కుమార్తెను కోల్పోయిన ఎస్తర్ ఘే అనే తల్లి, ఈ నిషేధం ఎందరో పిల్లల ప్రాణాలను కాపాడగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ఈ చట్టం అమలు తీరుపై నిపుణులు కొన్ని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఆస్ట్రేలియాలో ఇటువంటి నిషేధం ఉన్నప్పటికీ, చాలామంది టీనేజర్లు వీపీఎన్ వంటి మార్గాల ద్వారా సోషల్ మీడియాను వినియోగిస్తున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ సవాళ్లను అంగీకరించిన ప్రధాని స్టార్మర్, సాంకేతిక అడ్డంకులను సాకుగా చూపి చర్యలు తీసుకోకుండా ఉండలేమని స్పష్టం చేశారు. కఠినమైన వయసు ధ్రువీకరణ వ్యవస్థలతో జూలై నుంచి ఈ చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# రేవంత్ అసమర్థుడు

మొదటి పేజీ తరువాయి

విమర్శించే సత్తా ధైర్యం రేవంత్ రెడ్డికి లేదన్నారు. తనపై నమోదైన ఓటుకు నోటు కేసు ఉచ్చు బిగుస్తుందనే భయంతో బీజేపీతో చీకటి ఒప్పందాలు చేసుకోవడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని కేటీఆర్ అన్నారు. అందుకే కేంద్రంలోని బీజేపీని కాకుండా తెలంగాణలో ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీని విమర్శించి ప్రజలను తప్పుదోవ పట్టించే నీచమైన ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తున్నారన్నారు. బీజేపీతో రేవంత్ రెడ్డికి ఉన్న లోపాయికారి ఒప్పందం వల్లనే ఎన్నిసార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా.. పట్టించుకోవడం లేదన్నారు. ఈ అంశంలో రేవంత్ రెడ్డి తన చేతగానితనానికి హైదరాబాద్ ప్రజలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సమర్థవంతమైన నాయకుడు ఉంటే గతంలో కేసీఆర్ పాలనలో అనుమతులు, రుణాలు



శరవేగంగా ఎలా వచ్చాయో, మీ దిక్కుమాలిన పాలనలో అవి ఎందుకు ఆగిపోయాయో ప్రజలకు అర్థమవుతోందని పేర్కొన్నారు. ఢిల్లీకి పోతే 'చెప్పులు ఎత్తుకుపోయే దొంగల్ని చూస్తున్నట్టుగా' చూస్తున్నారని మీరే చెప్పుకున్నప్పుడే మీ నిజ స్వరూపం బయటపడిందని, బీఆర్ఎస్ పైన, కేసీఆర్ పై పడి ఏడవడం తప్ప మీకు ఏ పని చేతకాదని 4 కోట్ల తెలంగాణ సమాజానికి అర్థమైందని కేటీఆర్ అన్నారు. కేంద్రం నుంచి నిధులు రాకుండా బీఆర్ఎస్ అడ్డుకుందని చెప్పడం అంటే, మోదీ కన్నా కేసీఆర్ పవర్ ఫుల్ అని పరోక్షంగా ఒప్పుకున్నట్లే కదా అని ఎద్దేవా చేశారు. మెట్రో రెండో దశను సాధించడంలో అట్టర్ ఫ్లాప్ అయినందుకు, మొదటి దశను ఆగం చేస్తున్నందుకు సీఎం వెంటనే ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పాలని, లేకపోతే 'మినీ ఇండియా' లాంటి హైదరాబాద్‌లో మీకు, మీ పార్టీకి పుట్టగతులు ఉండవని కేటీఆర్ హెచ్చరించారు.




# కిషన్ రెడ్డే అడ్డు

మొదటి పేజీ తరువాయి

రూ. 350 కోట్ల నిర్మాణ ఖర్చవుతుందని అంచనాలు ఉన్నాయని పేర్కొన్నారు. మెట్రో రైల్ నిర్మాణంలో గత సీఎం కేసీఆర్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. మెట్రోను 3 ఏళ్లు ఆలస్యం చేయడంతో రూ. 7 వేల కోట్ల అంచనాలు కాస్తా.. రూ. 22 కోట్లకు పెరిగినట్లు పేర్కొన్నారు. మెట్రో కూడా రైల్వే కిందికి వస్తుందని అందుకే కేంద్ర ప్రభుత్వాన్ని అప్పు అడిగినట్లు చెప్పిన రేవంత్ రెడ్డి.. ఐఆర్ఎఫ్‌సీ రుణం కోసం అంతా సిద్ధం చేసినట్లు చెప్పారు. ఆ లోన్ వచ్చే సమయానికి సరిగ్గా కిషన్ రెడ్డి అడ్డు తగిలారని ఆరోపించారు. మే 30వ తేదీనే కేంద్రం నుంచి రూ. 13,600 కోట్ల రుణం రావాల్సి ఉన్నా.. కిషన్ రెడ్డి రానీయకుండా చేశారని దుయ్యబట్టారు. కేవలం 4 శాతం వడ్డీతో రుణం అప్రూవ్ చేసుకుంటే.. దాన్ని రాకుండా చేశారని మండిపడ్డారు. దానికి పేపర్ ఫీజు కింద రూ. 84 కోట్లు.. ఈక్విటీ రూ. 1400 కోట్లు కూడా చెల్లించినట్లు సీఎం రేవంత్ స్పష్టం చేశారు. గత నెల 21వ తేదీన కిషన్ రెడ్డి.. మరో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి తెలంగాణలో బీజేపీ ఉండాలా వద్దా అని నిలదీసి.. ఆ రుణం రాకుండా ఆపేశారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. సమస్యలపై మాట్లాడుదాం అంటే కిషన్ రెడ్డి సమయం ఇవ్వరని పేర్కొన్నారు. కిషన్ రెడ్డి వెనుక కేటీఆర్ ఉన్నారని.. కేటీఆర్ చెప్పిందే కిషన్ రెడ్డి చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. జపాన్ నుంచి నిధులు వచ్చినా కేంద్రం తెలంగాణకు ఇవ్వడం లేదని తెలిపారు. ఇది చూస్తూనే తెలంగాణపై కేంద్రానికి ఎంత వివక్ష ఉందో అర్థం అవుతోందని అన్నారు. ఇప్పటికైనా హైదరాబాద్ మెట్రోకు నిధులు ఇప్పించి, ఎన్ఓసీ ఇస్తే కిషన్ రెడ్డికి శాలువా కప్పి సన్మానం చేస్తామని రేవంత్ తెలిపారు. కేంద్రం భాగస్వామ్యం లేకుండా రూ. 40 వేల కోట్లతో మెట్రో విస్తరణను రాష్ట్ర ప్రభుత్వమే చేసుకుంటామని ఎన్ఓసీ ఇవ్వాలని కోరినా ఇవ్వడం లేదని వాపోయారు. కేంద్రం నుంచి నిధులు ఇప్పించకపోయినా.. ఎన్ఓసీ అయినా ఇప్పించాలని పేర్కొన్నారు. మెట్రో విస్తరణపై ఇప్పటికైనా కిషన్ రెడ్డి బాధ్యత చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# చిక్కదు.. దొరకదు!

మొదటి పేజీ తరువాయి

టెర్రెయిన్ మ్యాచింగ్ సామర్థ్యాలు దీనిలో ప్రత్యేకతలు. రక్షణ వ్యూహాత్మక దృష్ట్యా ఈ క్షిపణి భారత్‌కు కీలక బలంగా మారనుంది. శత్రు భూభాగంలో లోతుగా ఉన్న అధిక ప్రాధాన్య లక్ష్యాలపై సుదూర దాడులు నిర్వహించే సామర్థ్యాన్ని ఇది అందిస్తుంది. భారీ స్థాయి సైనిక చర్యలకు వెళ్లకుండా ఖచ్చితమైన స్టాండ్-ఆఫ్ దాడులు చేయడానికి ఇది ఉపయోగపడుతుందని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవలే బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ (బీఎండీ), యాంటీ-షిప్ సామర్థ్యాలను ప్రదర్శించే మూడు వరుస క్షిపణి పరీక్షలను విజయవంతంగా నిర్వహించిన భారత్, ఇప్పుడు లాంగ్ రేంజ్ క్రూయిజ్ మిసైల్ పరీక్షతో తన రక్షణ రంగ పురోగతిని మరోసారి ప్రపంచానికి చాటింది.

# అవగాహన ఒప్పందమే

మొదటి పేజీ తరువాయి

నిర్వహించనున్నారు. అనంతరం టెహ్రాన్, ఖోమ్ నగరాల్లో అంతిమయాత్రలు సాగనున్నాయి. చివరి అంత్యక్రియలు జూలై 9న మషహద్‌లో నిర్వహించి, అదే రోజు ఇమామ్ రిజా పవిత్ర స్థలంలో ఖమేనీకి ఖననం చేయనున్నట్లు ఇరాన్ వర్గాలు వెల్లడించాయి.



# సివిల్స్ (ప్రిలిమినరీ) పరీక్ష ఫలితాలు విడుదల

మొదటి పేజీ తరువాయి

నంబర్లతో కూడిన పీడీఎఫ్ జాబితాను విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా మే 24వ తేదీన ప్రిలిమ్స్ పరీక్ష జరగ్గా.. ఈ పరీక్షకు రికార్డు స్థాయిలో 8,19,372 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా.. దాదాపు 5.49 లక్షల మంది హాజరైన విషయం తెలిసిందే. మరోవైపు, ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు సైతం విడుదలయ్యాయి. ఈ పరీక్షలో సత్తా చాటిన అభ్యర్థుల జాబితాను పేర్లతో సహా యూపీఎస్సీ విడుదల చేసింది. యూపీఎస్సీ 2026 నోటిఫికేషన్ ద్వారా సివిల్ సర్వీసెస్‌లో 933 పోస్టులను, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో 80 పోస్టులను భర్తీ చేయనుంది.

# ఒప్పందం పూర్తయ్యింది

మొదటి పేజీ తరువాయి

ఎత్తివేస్తున్నాను. ప్రపంచ దేశాల నౌకలు తమ ప్రయాణాలను ప్రారంభించవచ్చు. చమురు మళ్లీ స్వేచ్ఛగా ప్రవహించనివ్వండి' అని పేర్కొన్నారు. మైన్స్ నిర్వీర్యం చేసే ప్రక్రియ కొనసాగుతోందని... జలసంధి ఇప్పటికే పాక్షికంగా తెరుచుకుందని క్లారిటీ ఇచ్చారు. జీ7 సమ్మిట్ కోసం ట్రంప్ ప్రస్తుతం ఫ్రాన్స్ లో పర్యటిస్తూ.. హర్మూజ్‌పై ఈ ప్రకటన చేశారు.

# పాకంలో భాగ్యనగరం భలే భలే!

## హైదరాబాద్‌కు జాతీయ స్థాయి గుర్తింపు!.. నేషనల్ కలినరీ డెస్టినేషన్‌గా అవార్డు

### అందుకున్న మంత్రి జూపల్లి కృష్ణారావు.. కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అందజేత

గోవా, జూన్ 15: దేశవ్యాప్తంగా పర్యాటక రంగంలో తెలంగాణా మరో అరుదైన ఘనతను సాధించింది. తనదైన ప్రత్యేక వంటకాలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన హైదరాబాద్ నగరం, తాజాగా 'నేషనల్ కలినరీ డెస్టినేషన్' (ఉత్తమ పాకశాస్త్ర గమ్యస్థానం) అవార్డును కైవసం చేసుకుంది. సోమవారం గోవా వేదికగా జరిగిన ఇండియా టుడే టూరిజం సదస్సులో ఈ ప్రతిష్టాత్మక అవార్డును ప్రకటించారు. ఈ అవార్డును తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, ఇండియా టుడే గ్రూప్ చైర్మన్ అండ్ ఎడిటర్-ఇన్-చీఫ్ అరుణ్ పూరీ, ఇండియా టుడే గ్రూప్ ఎడిటోరియల్ డైరెక్టర్ (పబ్లిషింగ్) రాజ్ చెంగప్ప, దేశంలోని వివిధ రాష్ట్రాల పర్యాటక మంత్రులు, విధాన రూపకర్తలు, పర్యాటక రంగ నిపుణులు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, హైదరాబాద్‌కు లభించిన ఈ గౌరవం నగరానికి ఉన్న గొప్ప ఆహార వారసత్వానికి, తెలంగాణ పర్యాటక రంగం సాధిస్తున్న ప్రగతికి ప్రతీక




అని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన హైదరాబాదీ బిర్యానీ, ఇరానీ చాయ్, తెలంగాణ సంప్రదాయ వంటకాలు దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయని తెలిపారు. ఈ గుర్తింపు తెలంగాణను వారసత్వ సంపద, సంస్కృతి, ఆతిథ్య మర్యాదలు, సంప్రదాయ ఆహార సంస్కృతికి నిలయంగా ఉన్న ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా మరోసారి నిలబెట్టిందన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం వారసత్వ పర్యాటక కేంద్రాలు, ఎకో-టూరిజం సర్క్యూట్లు, ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాలు, అడ్వెంచర్ టూరిజం గమ్యస్థానాలు, సాంస్కృతిక ఆకర్షణలను ప్రోత్సహించేందుకు పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. తెలంగాణలో పర్యాటకుల రాకపోకలు గణనీయంగా పెరుగుతున్నాయని, వారసత్వ, ఎకో, వైద్య, ఆధ్యాత్మిక, కలినరీ పర్యాటక రంగాలపై ఆసక్తి మరింత పెరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. పర్యాటక మౌలిక సదుపాయాల బలోపేతం, మెరుగైన అనుసంధానం, సందర్శకులకు మరింత మెరుగైన అనుభూతి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రపంచంలోని ప్రముఖ ఆహార నగరాల జాబితాలో హైదరాబాద్ స్థానం దక్కించుకున్న నేపథ్యంలో ఈ అవార్డు నగర ఖ్యాతిని మరింత పెంచిందన్నారు. దేశంలోని ప్రముఖ ఆహార పర్యాటక గమ్యస్థానాల్లో హైదరాబాద్ ఒకటిగా తన ప్రత్యేక గుర్తింపును మరింత బలపరుచుకుందని చెప్పారు. ఈ అవార్డును తెలంగాణ ప్రజలకు, పర్యాటక, ఆతిథ్య రంగాలకు చెందిన భాగస్వాములందరికీ అంకితం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ గుర్తింపు తెలంగాణను దేశంలోని అగ్రశ్రేణి పర్యాటక గమ్యస్థానాల్లో ఒకటిగా తీర్చిదిద్దే ప్రయత్నాలను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. భారతదేశంలో పర్యాటక ప్రోత్సాహం, గమ్యస్థానాల అభివృద్ధి, సందర్శకుల అనుభవాలను మెరుగుపరచడంలో విశిష్ట కృషి చేసిన రాష్ట్రాలు, సంస్థలు, పర్యాటక రంగ భాగస్వాములకు ఇండియా టుడే టూరిజం అవార్డ్స్ ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి పాల్గొన్నారు.



## తెలంగాణ అమరుల గుర్తింపులో జాప్యమెందుకు?

**రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడిచిందిగా**

**ఢిల్లీలో పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు**


న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 12 ఏళ్లు గడుస్తున్నా, ఉద్యమ అమరవీరులను సముచితంగా గుర్తించి గౌరవించడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమంలో సుమారు 1,200 మంది ప్రాణత్యాగం చేశారని, వారి బలిదానాలు తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. "ప్రజలు ప్రాణత్యాగాలు చేసేంత గొప్ప నేల అది. అందుకే నాకు ఆ నేల పట్ల, అక్కడి ప్రజల పట్ల ఎంతో గౌరవం ఉంది. ఒక లక్ష్యం కోసం ఇంతమంది ఆత్మబలిదానాలు చేసుకుంటారా అనిపించింది" అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో అమరవీరులకు నివాళులర్పించేందుకు తాను వెళ్లాలని భావించగా, ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని ఈ సందర్భంగా ఆరోపించారు. యువతను బలిచేసి కొందరు నాయకులు తెలంగాణలో అధికార పీఠాన్ని అధిరోహించారని ఆయన విమర్శించారు. తెలంగాణ ఉద్యమ అసలు ఆకాంక్షల సాధన కోసం జనసేన నిరంతరం శ్రమిస్తుందని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో ఉండి భవిష్యత్తు ప్రయోజనాల కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## విదేశాల్లో తెలంగాణ బియ్యానికి డిమాండ్

**ఆ 8 రకాల వంగడాలతోనే రైతులకు లాభాలు**

**ఎగుమతి రకాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి**

**కేబినెట్ సబ్ కమిటీకి వ్యవసాయ నిపుణుల కీలక సూచన**



హైదరాబాద్, జూన్ 15 (ఈవార్తలు): దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ మార్కెట్లోనూ అద్భుతమైన డిమాండ్ ఉన్న 8 రకాల మేలురకం వరి సాగుపై రైతులకు పెద్ద ఎత్తున విస్తృతమైన అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలు ప్రభుత్వానికి సూచించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ప్రజా భవన్‌లో సోమవారం కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి శ్రీ డి. శ్రీధర్ బాబు, శ్రీ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీ తుమ్మల నాగేశ్వర్ రావులు హాజరయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు, నిల్వ సదుపాయాలు, వానకాలం సాగు పై కేబినెట్ సబ్ కమిటి చాలా లోతుగా సమీక్ష చేసింది. ఈ సందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు, శాస్త్రవేత్తలు పాల్గొని పలు కీలక ప్రతిపాదనలను కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. రైతులకు లాభాదాయకం, ఎగుమతులకు అనుకూలమైన బీపీటీ 5204, తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048), కేఎన్ఎం-1638, జై శ్రీరామ్, హెచ్ఎంటీ, డబ్ల్యూజీఎల్ 962, డబ్ల్యూజీఎల్ 44, జేజీఎల్ 1798 ఈ 8 రకాల వంగడాలను రైతులు పెద్ద ఎత్తున సాగు చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని వారు స్పష్టం చేశారు. ఈ ప్రత్యేక 8 రకాల వంగడాలను సాగు చేయడం వల్ల రైతులకు మార్కెట్లో తిరుగులేని డిమాండ్ లభిస్తుందని అగ్రికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు వివరించారు. మార్కెట్లో ఈ బియ్యానికి ఉన్న విపరీతమైన క్రేజ్ దృష్ట్యా, ప్రభుత్వ మద్దతు ధర కంటే చాలా ఎక్కువ ధర పలికే అవకాశం ఉంది. "తెలంగాణ నుంచి విదేశాలకు ఎగుమతి చేయడానికి ఇవి అత్యంత అనుకూలమైనవి. ముఖ్యంగా అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ దేశాలలో ఈ బియ్యానికి విపరీతమైన ఆదరణ ఉంది. దీనివల్ల ఇది రైతులకు అత్యంత లాభదాయకమైన పంటగా మారనుంది. ఈ మేలు రకం పంటలను సాగు చేయడానికి మార్కెట్లో విత్తనాల కొరత అస్సలు లేదని, కాబట్టి సాగును విస్తృతం చేయడం సులువని" శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. రైతుల ఆదాయం గణనీయంగా పెరగాలన్నా, అంతర్జాతీయ మార్కెట్ ధరల్లో వచ్చే ఒడిదొడుకుల (రిస్క్) నుండి రైతులకు పూర్తి రక్షణ లభించాలన్నా ఈ 8 రకాల వంగడాల సాగు ఒక్కటే మార్గం. ప్రభుత్వం ఈ వంగడాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, గ్రామ గ్రామాన రైతులను చైతన్యపరచడానికి ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి. రాబోయే సీజన్లలో ఈ రకాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించడం ద్వారా అటు రైతులకు అదనపు ఆదాయం, ఇటు మార్కెట్ రంగానికి పూర్తి ప్రయోజనం చేకూరుతుందని, వరి సాగులో తెలంగాణ రాష్ట్రం మరింత లాభదాయకమైన దిశగా అడుగులు వేస్తుందని వ్యవసాయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్లు సైతం కేబినెట్ సబ్ కమిటీకి నివేదించారు. రాష్ట్రంలో సాగు చేస్తున్న అన్ని రకాల సన్న బియ్యానికి మార్కెట్లో ఆదరణ లభించడం లేదని సివిల్ సప్లై అధికారులు మంత్రులకు వివరించారు. కొన్ని రకాల వరి ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తున్నప్పుడు బియ్యం ఎక్కువగా విరిగిపోతుండటం (బ్రోకెన్ రైస్), అలాగే వినియోగదారుల అభిరుచులకు తగ్గట్టుగా అవి లేకపోవడంతో మిల్లర్లు, వ్యాపారులు వాటిని కొనుగోలు చేయడానికి ఇష్టపడటం లేదని, వినియోగదారులు, మిల్లర్లు మరియు వ్యాపారులకు ఇష్టమైన.. అలాగే అంతర్జాతీయంగా ఎగుమతులకు అనుకూలమైన నిర్దిష్ట వరి రకాలను మాత్రమే ఇకపై ప్రోత్సహించాలని, డిమాండ్ లేని రకాల సాగును క్రమంగా తగ్గించడం మంచిదని అభిప్రాయపడ్డారు. ఈ విధానం వల్ల మిల్లర్లే నేరుగా రైతుల వద్దకు వచ్చి మంచి ధరలకు వరిని కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని, తద్వారా రైతులకు లాభం చేకూరడమే కాకుండా, ప్రజలకు కూడా ఇష్టమైన నాణ్యమైన బియ్యం అందుబాటు ధరల్లో లభిస్తాయని అధికారులు వివరించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగానే రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని కేబినెట్ సబ్ కమిటికి అధికారులు నివేదించారు. భవిష్యత్తులో రైతులకు నష్టాలు రాకుండా ఉండేందుకు పూర్తిగా మార్కెట్ డిమాండ్ ఆధారిత పంటలను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులు మంత్రులకు వివరించారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

## చాయ్ మాస్టర్లకు రూ.5 లక్షల జీతం

**కేఫ్ నీలోఫర్‌లో టెకీలకు మించి ప్యాకేజీ**

హైదరాబాద్, జూన్ 15 (ఈవార్తలు): హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ నీలోఫర్ కేఫ్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. దశాబ్దాలుగా తనదైన రుచితో నగరవాసులను ఆకట్టుకుంటున్న ఈ కేఫ్, ఇప్పుడు తన ఉద్యోగులకు ఇస్తున్న జీతాల విషయంలో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. కేఫ్‌లో పనిచేసే సిబ్బందికి నెలకు ఏకంగా రూ. 5 లక్షల వరకు జీతం ఇస్తున్నట్లు వెల్లడి కావడంతో ఐటీ ఉద్యోగులు, కార్పొరేట్ సీఈవోలు సైతం ఆశ్చర్యపోతున్నారు. నీలోఫర్ కేఫ్ అధినేత బాబూరావు కుమారుడు, కేఫ్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన అనుమల శశాంక్ ఇటీవల ఓ బిజినెస్ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆయన తమ ఉద్యోగుల జీతభత్యాల గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. "సాధారణంగా ఒక కేఫ్ సిబ్బందికి నెలకు రూ. 50 వేల వరకు జీతం ఇస్తారు. కానీ, మా నీలోఫర్ కేఫ్‌లో ఏడాదికి రూ. 60 లక్షల ప్యాకేజీ, అంటే నెలకు రూ. 5 లక్షల వరకు జీతం తీసుకునే వారు కూడా ఉన్నారు" అని శశాంక్ తెలిపారు.

## బడుల్లో బ్రేక్ ఫాస్ట్ ప్రారంభం

**వారంలో మూడ్రోజులు పాలు, మూడ్రోజులు రాగి మాల్ట్**

**విద్యార్థులకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు**

హైదరాబాద్, జూన్ 15 (ఈవార్తలు): వేసవి సెలవుల అనంతరం తెలంగాణ వ్యాప్తంగా సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. కొత్త విద్యా సంవత్సరం తొలి రోజు నుంచే రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అల్పాహార పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్రంలోని 1,269 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలు చేస్తుండగా, దీని ద్వారా సుమారు 1.44 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ పథకం కింద విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మిగిలిన మూడు రోజులు రాగి మాల్ట్ అందిస్తారు. ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులందరికీ ఈ అల్పాహారం వర్తిస్తుంది. ఇప్పటికే అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా విస్తరించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడం, హాజరు శాతం పెంచడం, డ్రాపౌట్లను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో ఈ పథకాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. చాలా రోజుల తర్వాత పాఠశాలలు తెరుచుకోవడంతో విద్యార్థుల సందడి నెలకొంది. కొత్త దుస్తులు, బ్యాగులతో విద్యార్థులు ఉత్సాహంగా బడిబాట పట్టారు. పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. "పాఠశాల కేవలం పాఠాలు నేర్పే ప్రదేశం కాదు. మన వ్యక్తిత్వాన్ని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే దేవాలయం. తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని నేను గట్టిగా నమ్ముతున్నాను. అందుకే విద్యా రంగాన్ని అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు అనేక సంస్కరణలు చేపట్టాం" అని సీఎం తన సందేశంలో పేర్కొన్నారు. "అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి పౌష్టికాహారం అందించడమే కాకుండా, విద్యార్థుల భవిష్యత్తు కోసం అనేక చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులు ఉత్సాహంగా చదువుకోవాలి. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో జ్ఞానాన్ని సంపాదించి, మీ కలలను సాకారం చేసుకోవాలి. విద్య అనేది ఎవరూ దొంగిలించలేని గొప్ప సంపద" అని విద్యార్థులకు సూచించారు.




## హైదరాబాద్‌ను తాకిన నైరుతి

**4-5 రోజుల్లో పూర్తిస్థాయి విస్తరణ**

హైదరాబాద్, జూన్ 15 (ఈవార్తలు): నైరుతి రుతుపవనాలు దేశవ్యాప్తంగా చురుగ్గా పురోగమిస్తున్నాయి. ఇవి తాజాగా తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోకి ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. రానున్న 4 నుంచి 5 రోజుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని మిగిలిన ప్రాంతాలన్నింటికీ రుతుపవనాలు విస్తరించడానికి పరిస్థితులు సానుకూలంగా ఉన్నాయని పేర్కొంది. ఆదివారం నాటికి రుతుపవనాల ఉత్తర సరిహద్దు (నార్తర్న్ లిమిట్ ఆఫ్ మాన్‌సూన్) మహారాష్ట్రలోని హర్నై, సోలాపూర్ మీదుగా ప్రయాణిస్తూ.. తెలంగాణలోని హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఆంధ్రప్రదేశ్‌లోని కళింగపట్నం వరకు విస్తరించినట్లు వాతావరణ శాఖ తెలిపింది. అక్కడి నుంచి పారాదీప్, బరిపద, ధన్‌బాద్ మీదుగా ముజఫర్‌పూర్ వరకు రుతుపవనాల విస్తరణ కొనసాగుతున్నట్లు స్పష్టం చేసింది. రానున్న 4-5 రోజుల్లో కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని మిగిలిన ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లోని మరికొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించనున్నాయి. అలాగే ఒడిశా, ఝార్ఖండ్, బీహార్, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాల్లోకి కూడా ఇవి ప్రవేశించే అవకాశం ఉందని ఐఎండీ తన తాజా బులెటిన్‌లో వివరించింది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాకాలం పూర్తిస్థాయిలో ప్రారంభం కానుంది.

## 19 నుంచి భారీ వర్షాలు

హైదరాబాద్, జూన్ 15 (ఈవార్తలు): భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖలతో పాటు జిల్లా యంత్రాంగాలను అప్రమత్తం చేసింది. జూన్ 19 నుంచి రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఇవి వారం రోజుల పాటు కొనసాగవచ్చన్న వాతావరణ శాఖ సూచనల మేరకు ప్రభుత్వం ఈ ముందస్తు చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, రెవెన్యూ మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శనివారం అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నైరుతి రుతుపవనాలు జూన్ 8న జోగులాంబ గద్వాల జిల్లా మీదుగా రాష్ట్రంలోకి ప్రవేశించి, జూన్ 14 నాటికి దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాలకు విస్తరించాయి.



# వరికి ఎల్ నినో ఉరి!

**భారీగా దిగుబడ్డి తగ్గే చాన్స్**

న్యూఢిల్లీ: 'ఎల్ నినో' వాతావరణ మార్పుల వల్ల భారత్‌లో ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో దేశంలో రాబోయే ఖరీఫ్ సాగు, పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం పడవచ్చని తెలిపింది. ఎల్ నినో ఎఫెక్ట్ వల్ల సాధారణంగా భారత్‌లో వర్షపాతం తగ్గడం, రుతుపవనాలు అస్తవ్యస్తం కావడం జరుగుతుంది. అది ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌ను దెబ్బతీసే ప్రమాదం ఉందని ఎఫ్‌వో పేర్కొంది. వర్షాధార పంటలపై ఈ మార్పుల ప్రభావం ఎక్కువగా ఉండనుంది. ముఖ్యంగా వరి, మొక్కజొన్న పంటలు కీలకమైన ఎదుగుదల దశలో నీటి ఎద్దడిని ఎదుర్కొనే అవకాశం ఉందని, దిగుబడులు కూడా భారీగా తగ్గుతాయని నివేదిక స్పష్టం చేసింది. అదేవిధంగా పంటల నష్టంతో పాటు, వ్యవసాయంపైనే ఆధారపడి బతికే గ్రామీణ ప్రజల జీవనోపాధి దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇప్పటికే వాతావరణ మార్పులతో ఇబ్బంది పడుతున్న ప్రాంతాల్లో ఆహార భద్రత మరింత క్షీణించవచ్చని ఎఫ్ఏవో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంచనాలపై స్పందించిన భారత ప్రభుత్వం స్పందించి తాము ముందస్తు చర్యలు చేపడుతున్నట్లుగా తెలిపింది. దేశంలో ఆహార భద్రతకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, నిత్యావసర ధాన్యాల కొరత రాకుండా చూసేందుకు తగినంత బఫర్ స్టాక్ అందుబాటులో ఉంచినట్లు కేంద్ర వర్గాలు తెలిపాయి.

# హోండా కార్లపై 2.15 లక్షల తగ్గింపు!

**యాక్సెసరీలు ఉచితం.. జూన్ 30 వరకు ఆఫర్లు**




న్యూఢిల్లీ: కొత్త కారు కొనేవారికి హోండా గుడ్‌న్యూస్ చెప్పింది. జూన్ నెలకుగానూ ప్రముఖ మోడళ్లపై భారీ డిస్కౌంట్లు, ప్రత్యేక ప్రయోజనాలను ప్రకటించింది. నగదు తగ్గింపులు, ఎక్స్ఛేంజ్ బోనస్‌లు, లాయల్టీ బెనిఫిట్స్, పొడిగించిన వారంటీ వంటి ఆఫర్లతో కొనుగోలుదారులు రూ.లక్షల్లో ఆదా చేసుకునే అవకాశం లభిస్తోంది. ఈ ఆఫర్లు జూన్ 30 వరకు అందుబాటులో ఉండనున్నాయి. హోండా లైనప్‌లో ప్రస్తుతం అత్యధిక ప్రయోజనాలు ఎలివేట్ ఎస్‌యూవీపైనే ఉన్నాయి. టాప్ వేరియంట్లయిన ఎలివేట్ జెడ్ఎక్స్ ఎంటీ, జెడ్ఎక్స్ సీవీటీ మోడళ్లపై గరిష్ఠంగా రూ.2.15 లక్షల వరకు ప్రయోజనాలు అందిస్తోంది. నగదు తగ్గింపులతో పాటు ఎక్స్ఛేంజ్ బోనస్‌లు కూడా ఉన్నాయి. కొన్ని వేరియంట్లకు 360 డిగ్రీల కెమెరా, ప్రీమియం డ్యాష్‌క్యామ్, ఇతర యాక్సెసరీ ప్యాకేజీలను ఉచితంగా అందిస్తోంది. 'ఎలివేట్ వీ అపెక్స్'పై రూ.1.61 లక్షల వరకు, వీఎక్స్ వేరియంట్‌పై రూ.1.53 లక్షల వరకు ప్రయోజనాలు లభిస్తున్నాయి. కాంపాక్ట్ సెడాన్ విభాగంలో మంచి ఆదరణ ఉన్న హోండా అమేజ్‌పైనా ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉన్నాయి. టాప్ వేరియంట్ అయిన అమేజ్ జెడ్ఎక్స్ ఎంటీపై గరిష్ఠంగా రూ.67 వేల వరకు ప్రయోజనాలు లభిస్తున్నాయి. అమేజ్ వీఎక్స్ వేరియంట్‌పై రూ.48 వేల వరకు, వీ వేరియంట్‌పై రూ.28 వేల వరకు తగ్గింపు ఉంది. ఎంపిక చేసిన వేరియంట్లకు అమర్చే సీఎన్‌జీ కిట్‌పై రూ.20 వేల వరకు రీయింబర్స్‌మెంట్‌ను కూడా హోండా అందిస్తోంది. ప్రీ-ఫేస్‌లిఫ్ట్ హోండా సిటీ సెడాన్‌పై కూడా కంపెనీ భారీ తగ్గింపు ప్రకటించింది. పెట్రోల్ వేరియంట్లపై రూ.1.56 లక్షల వరకు ప్రయోజనాలు లభిస్తున్నాయి. హైబ్రిడ్ టెక్నాలజీతో వచ్చే 'సిటీ ఈ:హెచ్‌ఈవీ' మోడల్‌పై రూ.1.97 లక్షల వరకు డిస్కౌంట్ అందిస్తోంది. దీంతో ప్రీమియం సెడాన్ కొనాలనుకునే వారికి ఇది మంచి అవకాశంగా మారింది. నగరం, డీలర్‌షిప్‌ను బట్టి ఆఫర్లలో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉంది. కాబట్టి కొనుగోలు చేసే ముందు సమీప డీలర్‌ను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవడం మంచిది.

# త్వరలో ఫోల్డబుల్ ఐఫోన్!

**టచ్ స్క్రీన్ మ్యాక్ బుక్ కూడా**

న్యూయార్క్: టెక్నాలజీ ప్రియులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రెండు విప్లవాత్మక ఉత్పత్తులను మార్కెట్లోకి తెచ్చేందుకు టెక్ దిగ్గజం ఆపిల్ ముమ్మరంగా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. మడతపెట్టే ఐఫోన్ (ఫోల్డబుల్ ఐఫోన్), టచ్‌స్క్రీన్‌తో పనిచేసే మ్యాక్‌బుక్ ల్యాప్‌టాప్‌లను అభివృద్ధి చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. రాబోయే ఐవోఎస్ 27, మ్యాక్ ఓఎస్ 27 సాఫ్ట్‌వేర్ల డెవలపర్ బీటా వెర్షన్లలో లభించిన కోడింగ్ ఆధారాలు ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తున్నాయి. ఈ మేరకు 'బ్లూమ్‌బెర్గ్' టెక్ విశ్లేషకుడు మార్క్ గుర్మన్ తన 'పవర్ ఆన్' నివేదికలో కీలక వివరాలు వెల్లడించారు. నివేదిక ప్రకారం ఆపిల్ రూపొందిస్తున్న ఫోల్డబుల్ ఐఫోన్ తెరిచినప్పుడు దాదాపు ఐప్యాడ్ మినీ పరిమాణంలో ఉంటుందని అంచనా. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ఇతర ఫోల్డబుల్ ఫోన్లలో మాదిరిగా స్క్రీన్ మధ్యలో మడత గీత కనిపించకుండా, అత్యంత నాణ్యమైన, మన్నికైన డిస్‌ప్లేను రూపొందించడంపై ఆపిల్ దృష్టి సారించినట్లు సమాచారం. ఐవోఎస్ 27 కోడింగ్‌లో స్క్రీన్ మడతను బట్టి యూజర్ ఇంటర్‌ఫేస్ మారేలా ప్రత్యేక ఫీచర్లను డెవలపర్లు గుర్తించారు. 'ఐఫోన్ అల్ట్రా' లేదా 'ఐఫోన్ ఫోల్డ్' పేరుతో రానున్న ఈ పరికరం 2026 నాటికి అందుబాటులోకి రావచ్చని భావిస్తున్నారు. మరోవైపు, మ్యాక్‌బుక్ ల్యాప్‌టాప్‌లకు టచ్‌స్క్రీన్ ఫీచర్‌ను జోడించేందుకు ఆపిల్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మ్యాక్ ఓఎస్ 27 కోడింగ్‌లో 'పుల్-టు-రిఫ్రెష్' వంటి టచ్ ఆధారిత జెస్టర్లు కనిపించడమే ఇందుకు నిదర్శనం. ఇప్పటివరకు ల్యాప్‌టాప్‌లకు టచ్‌స్క్రీన్ అవసరం లేదన్న వాదనను వినిపించిన ఆపిల్.. మారుతున్న వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా తన వ్యూహాన్ని మార్చుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. ఈ టచ్‌స్క్రీన్ మ్యాక్‌బుక్‌లలో ఓఎల్ఈడీ డిస్‌ప్లే, అత్యాధునిక ఎం-సిరీస్ ప్రాసెసర్లను ఉపయోగించే అవకాశం ఉంది. ఈ రెండు కొత్త ఆవిష్కరణలు గనుక వాస్తవరూపం దాల్చితే స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ మార్కెట్లలో ఆపిల్ తన ఆధిపత్యాన్ని మరింత పెంచుకోవడం ఖాయమని టెక్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. 2026 చివరి నాటికి లేదా 2027 ఆరంభంలో ఈ ఉత్పత్తులు వినియోగదారులకు అందుబాటులోకి రావచ్చని అంచనా వేస్తున్నారు

# సీజేపీ అధ్యక్షుడిపై దాడి

**జైపూర్ ఆందోళనల సమయంలో ఘటన**

జైపూర్: కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాప అధ్యక్షుడు అభిజిత్ దీప్కేపై సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో సీజేపీ నిర్వహించిన ఆందోళనలో పాల్గొంటున్న సమయంలో అన్యూహ్య పరిణామం చోటుచేసుకుంది. అభిజీత్ దీప్కేవైపు దూసుకొచ్చిన ఓ వ్యక్తి.. ఆయన చెంప ఛెల్లుమనిపించాడు. అయితే, దీప్కే మద్దతుదారులు ఆ వ్యక్తిని చుట్టిముట్టి దాడి చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నీట్ పేపర్ లీకేజ్, సీబీఎస్ఈ ఉదంతంపై కేంద్రానికి వ్యతిరేకంగా దేశంలోని పలు నగరాల్లో కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనలు నిర్వహిస్తోంది. తాజాగా, సోమవారం జైపూర్‌లో నిరసన చేపట్టింది. సోషల్ మీడియాలో వీడియోల ప్రకారం.. నిందితుడు చెంపదెబ్బ తర్వాత పరిస్థితి అదుపు తప్పింది. దీప్కేను కొట్టాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని పలువురు చుట్టుముట్టి దాడి చేస్తున్నట్లు ఆ ఫుటేజీలో కనిపిస్తోంది. ఈ గందరగోళం నడుమ అతడిపై దాడి చేయొద్దని తన మద్దతుదారులకు దీప్కే విజ్ఞప్తిచేశాడు. అయినప్పటికీ గుంపు వెంటనే వెనక్కి తగ్గలేదు. ఈ ఘటనపై అధికారులు ఇంకా అధికారిక ప్రకటన విడుదల చేయాల్సి ఉంది. నీట్ లీకేజీకు బాధ్యతవహిస్తూ కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో సీజేపీ ఆధ్వర్యంలో దేశంలోని పలు నగరాల్లో ఆందోళనలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో తొలి నిరసన జరిగింది. తర్వాత ఇండోర్, లక్నో, హైదరాబాద్, బెంగళూరులో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఆందోళనలకు పెద్ద సంఖ్యలో యువత హాజరై తమ నిరసన తెలియజేశారు.

# ఆర్థిక వ్యవస్థ బలంగానే.. కానీ!

**వృద్ధిని తేలిగ్గా తీసుకోవద్దు**




న్యూఢిల్లీ: సోమవారం జరిగిన 'మైండ్‌మైన్ సమ్మిట్ 2026'లో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. "మన దేశం ఆర్థికంగా బాగానే రాణిస్తోందని నాకు తెలుసు. కానీ, మన పనితీరును మనం నిరంతరం జాగ్రత్తగా విశ్లేషించుకోవాలి. ఇంకా ఎక్కడ మెరుగుపరుచుకోవాలో గుర్తించాలి" అని అన్నారు. కేవలం ఆర్థిక వృద్ధి మాత్రమే సరిపోదని, స్థిరమైన, సమ్మిళిత అభివృద్ధి కోసం బలమైన సంస్థలు, సమర్థవంతమైన విధానాలు, పటిష్ఠమైన మద్దతు వ్యవస్థలు ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు. భారత్ వంటి పెద్ద, సంక్లిష్ట ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని నిలబెట్టుకోవాలంటే సామర్థ్యాలను బలోపేతం చేయడం, సామర్థ్యాన్ని మెరుగుపరచడం, అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా చూడటం కోసం నిరంతరం కృషి చేయాలని ఆమె సూచించారు. "పురోగతి దానంతట అదే వస్తుందని భావించకూడదు. వృద్ధి వేగాన్ని కొనసాగించడానికి నిరంతర కృషి, ఆవిష్కరణలు, సంస్కరణలు తప్పనిసరి" అని ఆమె పేర్కొన్నారు. అనేక రంగాలు బలంగా రాణిస్తున్నప్పటికీ, ముఖ్యంగా సంక్లిష్టమైన, మధ్యంతర ఉత్పత్తులు, సేవలకు సంబంధించిన కొన్ని రంగాలకు విధానపరమైన మద్దతు ఇంకా అవసరమని ఆమె అంగీకరించారు. దీర్ఘకాలంగా ఉన్న సవాళ్లను నిర్మాణాత్మక సంస్కరణలు, మెరుగైన అమలు లేదా కొత్త విధానాల ద్వారా ఎలా పరిష్కరించవచ్చో విధానకర్తలు నిరంతరం పరిశీలించాలని అన్నారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంపై కేంద్ర మంత్రి కీలక హెచ్చరిక చేశారు. దీని కారణంగా రుతుపవనాలు బలహీనంగా ఉండే అవకాశం ఉందని, ప్రభుత్వం అందుకు సిద్ధమవుతోందని తెలిపారు. "కొన్ని ప్రాంతాలు పొడిగా ఉండొచ్చు, మరికొన్ని చోట్ల అధిక వర్షాలు కురవొచ్చు. ఇది ఏడాది పొడవునా ఆందోళన కలిగించే అంశం. అయితే, ఈసారి ఎల్ నినో కారణంగా బలహీనమైన రుతుపవనాలకు మేం సిద్ధమవుతున్నాం" అని నిర్మల వివరించారు. కోవిడ్-19 మహమ్మారి అనంతర ప్రభావాలు ఇంకా ప్రణాళికలను ప్రభావితం చేస్తున్నప్పటికీ, పెద్ద అంతరాయాలు ఏవీ ఊహించడం లేదని ఆమె తెలిపారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విధానాలను మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు.

# డాలర్‌పై బలపడిన రూపాయి

**అమెరికా-ఇరాన్ ఒప్పందంతో సానుకూల ప్రభావం.. స్టాక్ మార్కెట్లలోనూ కనిపించిన ఉత్సాహం**



ముంబై: అంతర్జాతీయంగా చోటుచేసుకున్న కీలక పరిణామాలతో సోమవారం ఫారెక్స్ మార్కెట్లో అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ భారీగా బలపడింది. అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిందన్న వార్తల నేపథ్యంలో ముడి చమురు ధరలు పతనం కావడంతో రూపాయి ఏకంగా 58 పైసలు లాభపడింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్లో 94.70 వద్ద ట్రేడింగ్ ప్రారంభించిన రూపాయి, ఆ తర్వాత మరింత పుంజుకుని 94.60 వద్ద స్థిరపడింది. గత సెషన్‌లో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 95.18 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధానికి ముగింపు పలుకుతూ శాంతి ఒప్పందం కుదిరిందని, దీనిలో భాగంగా వ్యూహాత్మక హర్మూజ్ జలసంధిని తిరిగి తెరుస్తారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం ఈ సానుకూల పరిణామాలకు ప్రధాన కారణమైంది. "ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ శుభాకాంక్షలు" అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ ఒప్పందంపై ఈ వారంలో స్విట్జర్లాండ్‌లో అధికారికంగా సంతకాలు జరగవచ్చని నివేదికలు సూచిస్తున్నాయి. ప్రపంచంలోని ఐదో వంతు ముడి చమురు రవాణా జరిగే ఈ కీలకమైన జలమార్గం తిరిగి తెరుచుకోనుండటంతో సరఫరాపై ఆందోళనలు తొలగిపోయాయి. ఈ ప్రకటనతో గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. గ్లోబల్ ఆయిల్ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర దాదాపు 5 శాతం పడిపోయి 83 డాలర్లకు చేరగా, యూఎస్ డబ్ల్యూటీఐ కూడా 5 శాతానికి పైగా తగ్గి 80 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ముడి చమురు ధరలు తగ్గడం భారత్‌కు పెద్ద ఊరటనిచ్చే అంశమని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు దిగుమతిదారులలో ఒకటైన భారతదేశానికి, ధరలు తగ్గడం వల్ల దిగుమతి బిల్లు గణనీయంగా తగ్గుతుంది. ఇది దేశ కరెంట్ అకౌంట్ లోటు (సీఏడీ)పై ఒత్తిడిని తగ్గించి, ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుంది. దీనికి తోడు ప్రపంచవ్యాప్తంగా డాలర్ బలహీనపడటం, యూఎస్ ట్రెజరీ ఈల్డ్స్ తగ్గడం, ఆసియా మార్కెట్లలో సానుకూల వాతావరణం వంటివి కూడా రూపాయి బలోపేతానికి దోహదపడ్డాయి. మే నెలలో భారత్ ద్రవ్యోల్బణం 3.9 శాతంగా నమోదవడం, ఇది ఆర్బీఐ లక్ష్యమైన 4 శాతం కంటే తక్కువగా ఉండటం కూడా స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని సూచిస్తోంది. అయితే, సమీప భవిష్యత్తులో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ పాలసీ నిర్ణయం, దాని చైర్ కెవిన్ వార్ష్ వ్యాఖ్యలపై మార్కెట్ వర్గాలు దృష్టి సారించాయి. అమెరికా వడ్డీ రేట్ల పెంపుపై వచ్చే సంకేతాలు రూపాయి కదలికలను ప్రభావితం చేయవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు దేశంలోకి డాలర్ల ప్రవాహాన్ని పెంచేందుకు ఆర్బీఐ ఇటీవల ఎన్ఆర్ఐ డిపాజిట్ విండోను పునరుద్ధరించడం వంటి చర్యలు కూడా రూపాయికి మద్దతుగా నిలుస్తున్నాయి. ఈ సానుకూల పరిణామాల నేపథ్యంలో దేశీయ ఈక్విటీ మార్కెట్లు కూడా లాభాల్లో పయనించాయి. సెన్సెక్స్, నిఫ్టీలు ట్రేడింగ్ ప్రారంభంలోనే 1 శాతానికి పైగా లాభపడ్డాయి.

## సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో తప్పిన భారీ దోపిడీ

బాపట్ల, జూన్ 15 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా పరిధిలో సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన దోపిడీ యత్నం కలకలం సృష్టించింది. ప్రయాణికులు అప్రమత్తం కావడం, రైల్వే పోలీసులు తక్షణమే స్పందించడంతో దుండగుల ప్రయత్నం విఫలమైంది. దొంగలను నిలువరించే క్రమంలో పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చెంగల్పట్టు నుంచి కాకినాడ పోర్ట్ కు వెళుతున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో ఈ ఘటన జరిగింది. తెల్లవారుజామున సుమారు 1:15 గంటల సమయంలో రైలు బాపట్ల - అప్పికట్ల స్టేషన్ల మధ్య నల్లమడ వాగు రైల్వే బ్రిడ్జి వద్ద ప్రయాణిస్తుండగా, దుండగులు ఎస్-3, ఎస్-6 స్లీపర్ కోచ్‌లలోకి ప్రవేశించారు. నిద్రిస్తున్న ఇద్దరు మహిళా ప్రయాణికుల నుంచి వారు బంగారు ఆభరణాలను అపహరించారు. దొంగల కదలికలను కేకలు వేయడంతో దుండగులు ఆందోళనకు గురయ్యారు. పట్టుబడతామనే భయంతో వెంటనే రైలు చైన్‌ను లాగి నిలిపివేశారు. కిందకు దూకి చీకట్లో పారిపోయేందుకు ప్రయత్నించగా, అక్కడే ఉన్న రైల్వే పోలీస్ ఎస్కార్ట్ సిబ్బంది వారిని అడ్డుకునేందుకు గాల్లోకి కాల్పులు జరిపారు.


# గూగుల్ సీఈవోకు చేదు అనుభవం

**ప్రసంగం మధ్యలో విద్యార్థుల వాకౌట్**

**గూగుల్ ఒప్పందాలపై నిరసన**

**పాలస్తీనా అనుకూల సంఘాల మద్దతు**

**నిరసన మధ్య కూడా ప్రసంగం కొనసాగింపు**



న్యూయార్క్: స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ ముఖ్య అతిథిగా ప్రసంగిస్తుండగా కొందరు విద్యార్థులు ఒక్కసారిగా సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. దీంతో సాధారణంగా ఆనందోత్సాహాల మధ్య జరిగే స్నాతకోత్సవంలో కాసేపు గందరగోళ వాతావరణం నెలకొంది. విద్యార్థుల ఈ వాకౌట్ వెనుక రాజకీయ, సామాజిక కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. 'స్టూడెంట్స్ ఫర్ జస్టిస్ ఇన్ పాలస్తీనా', 'నో టెక్ ఫర్ అపార్థీడ్' వంటి సంఘాలు ఈ నిరసనకు మద్దతు ఇచ్చినట్లు సమాచారం. ఇజ్రాయెల్ రక్షణ దళాలు, అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం, ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో గూగుల్ ఒప్పందాలు కుదుర్చుకుందనే ఆరోపణలకు వ్యతిరేకంగా ఈ నిరసన చేపట్టినట్లు వెల్లడించాయి. అయితే ఈ పరిణామాలపై నేరుగా స్పందించకుండా సుందర్ పిచాయ్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. కృత్రిమ మేధ (ఏఐ), టెక్నాలజీ రంగంలోని పరిణామాల గురించి విస్తృతంగా మాట్లాడకుండా విద్యార్థుల జీవితానికి ఉపయోగపడే సూచనలు చేశారు. ప్రస్తుతం తనకు ఏం మాట్లాడాలనే దానికంటే ఏం మాట్లాడకూడదనే సలహాలే ఎక్కువగా వస్తున్నాయని సరదాగా వ్యాఖ్యానించారు. జీవితంలో పరిస్థితులను ఎలా అర్థం చేసుకుంటామన్న దానిపైనే మన దృక్పథం ఆధారపడి ఉంటుందని పిచాయ్ అన్నారు. కొత్త అవకాశాలను ఆశావాదంతో స్వీకరించాలని విద్యార్థులకు సూచించారు. 1990ల్లో కాలిఫోర్నియాకు తొలిసారి వచ్చిన రోజులను గుర్తు చేసుకుంటూ అప్పట్లో ఏర్పడిన కొన్ని అభిప్రాయాలు తర్వాత మారిపోయాయని చెప్పారు. ఒకే విషయాన్ని వేరే కోణంలో చూసినప్పుడు దాని అర్థం పూర్తిగా మారిపోతుందని వివరించారు. ఏఐ ప్రభావంతో ఉద్యోగ అవకాశాలపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. కొత్తగా ఉద్యోగ మార్కెట్‌లోకి అడుగుపెడుతున్న యువతలో ఆందోళన పెరుగుతోంది. అయితే పిచాయ్ తన ప్రసంగంలో ఈ అంశాన్ని ప్రస్తావించకుండా, మార్పులను స్వీకరించే సామర్థ్యమే భవిష్యత్తులో విజయానికి కీలకమని సూచించారు. 2015 నుంచి గూగుల్‌కు నాయకత్వం వహిస్తున్న సుందర్ పిచాయ్ స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ మాజీ విద్యార్థి కూడా. ఏఐ సాంకేతిక రంగంలో భారీ మార్పులకు దారితీస్తోందని గతంలో ఆయన పలుమార్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పట్టభద్రులవుతున్న తరం ఆ మార్పులను చూసే వారిగానే కాకుండా, వాటిని నిర్మించే వారిగా కూడా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

# పంజాబ్ సీఎం.. గురు ద్రోహి

**ప్రకటించిన అకాల్ తఖ్త్**



చండీగఢ్: పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కు సిక్కుల అత్యున్నత ఆధ్యాత్మిక సంస్థ అకాల్ తఖ్త్ భారీ షాకిచ్చింది. ఆయనను 'గురు ద్రోహి'గా ప్రకటిస్తూ.. సిక్కు సమాజం మాన్‌తో ఎటువంటి సంబంధం పెట్టుకోవద్దని పిలుపునిచ్చింది. అకాల్ తఖ్త్ అనేది సిక్కుల అత్యున్నత మత సంస్థ. సిక్కు భక్తులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై నోటీసులు జారీచేయడంతో గత జనవరి 15న పంజాబ్ ముఖ్యమంత్రి అకాల్ తఖ్త్ ఎదుట హాజరయ్యారు. ఈ సమయంలో సిక్కు గురువులపై భగవంత్ మాన్ మద్యం చల్లుతున్నట్టు ఓ వీడియోపై కూడా మత పెద్దలు ప్రశ్నించారు. అయితే, అది ఏఐ వీడియో అని తోసిపుచ్చారు. కానీ, సోమవారం వచ్చిన ఫోరెన్సిక్ నివేదికలో అది అసలైన వీడియో అని వెల్లడయ్యింది. ఆ వీడియోలోని వ్యక్తి నిజంగా ముఖ్యమంత్రే అని ఫోరెన్సిక్ నివేదిక చెప్పలేదని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎదురు వాదన చేసింది. కానీ, ఐదుగురు సింగ్ సాహిబ్‌ల (ప్రధాన మతగురువుల) సమావేశం అనంతరం.. అకల్ తఖ్త్ జాతేదార్ కుల్దీప్ సింగ్ గర్గాజ్ తీర్పును ప్రకటించారు. "మేము ఆ వీడియో గురించి ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే అది ఏఐతో రూపొందించిందని ఆయన సమాధానం ఇచ్చారు.. దీనికి రుజువు చూపమని ఆయన్ని కోరాం.. కానీ ఆరు నెలల పాటు ఎటువంటి స్పందన రాలేదు. ఆ తర్వాత, భారత ప్రభుత్వం గుర్తించిన రెండు ఫోరెన్సిక్ ల్యాబ్‌ల్లో ఆ వీడియోను పరీక్షించగా నకిలీది కాదని, ఏఐతో రూపొందించింది కూడా కాదని తేలింది. ఈరోజు, 'పంథ్' ఈ విషయంపై చర్య తీసుకుని ఒక నిర్ణయానికి వచ్చింది" అని గర్గాజ్ అన్నారు. అకాల్ తఖ్త్ వద్ద మాన్ అబద్ధం చెప్పారని అందుకే ఆయనను గురువు దృష్టిలో దోషిగా లేదా 'గురు ద్రోహి'గా ప్రకటించారని జాతేదార్ అన్నారు. "సిక్కులకు ముఖ్యమంత్రిపై ఎలాంటి అంచనాలు లేవు, 'పంథ్', గురువు అనుచరులు ఆయనతో ఎటువంటి సంబంధం పెట్టుకోకూడదు" అని ఆయన తెలిపారు. వచ్చే ఏడాది పంజాబ్ అసెంబ్లీకి ఎన్నికల జరగనున్న నేపథ్యంలో అకాల్ తఖ్త్ మరో సంచలన నిర్ణయం తీసుకుంది. 'జాగత్ జోత్ శ్రీ గురు గ్రంథ్ సాహిబ్ సత్కార్ (సవరణ) బిల్లు, 2026' ఆమోదం విషయంలో పంజాబ్ క్యాబినెట్ మొత్తాన్ని జూన్ 29న తమ ముందు హాజరు కావాలని అకల్ తఖ్త్ ఆదేశించింది. సిక్కుల పవిత్ర గ్రంథాన్ని అగౌరవపరిచే చర్యలకు పాల్పడిన వారికి ఈ బిల్లు యావజ్జీవ కారాగార శిక్ష వరకు విధించే వీలు కల్పిస్తుంది.



## ది బేక్ హౌజ్ ప్రారంభోత్సవంలో బండి రమేశ్

కూకట్‌పల్లి, జూన్ 15 (ఈవార్తలు): వినియోగదారులు మెచ్చేలా వ్యాపారం చేస్తే వారి మనసులు గెలుచుకుంటామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేశ్ అన్నారు. సోమవారం గాజుల రామారంలో బాబు, మహేశ్, నరేశ్, అభినయ్ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన ది బేక్ హౌజ్ స్వీట్ షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపిన రమేశ్.. వినియోగదారులు మెచ్చేలా స్వీట్ షాప్‌ను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి దినేశ్ కుమార్, యాక నారాయణ, వినోద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## అసలైన ప్రీస్కూల్.. అంగన్వాడీ!

**బల్వంతాపూర్‌లో ఘనంగా అంగన్వాడీ బడి బాట**


మల్యాల, జూన్ 15 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం బల్వంతాపూర్‌లో అంగన్వాడీ బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాశీనగర్‌లో ర్యాలీ నిర్వహించి పిల్లల తల్లిదండ్రులకు అంగన్వాడీల గురించి, అక్కడ నేర్పే విషయాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఉప సర్పంచ్ జంగిలి శ్రీశైలం.. పిల్లల మానసిక, శారీరక ఉల్లాసానికి అంగన్వాడీ కేంద్రాలు నిలయాలుగా నిలుస్తున్నాయని అన్నారు. ఇక్కడ పిల్లలకు ఆటలు, పాటలు, కథలు, మంచి అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి తెలియజేస్తారని, అసలైన ప్రీ స్కూల్ అంటే ఇదేనని, అంగన్వాడీ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. 3-6 ఏళ్ల పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, తల్లులు, అంగన్వాడీ టీచర్లు జలజ, నిర్మల, స్వప్న, సూపర్ వైజర్ షమీమ్ సుల్తానా, పాల్గొన్నారు.



## జగిత్యాల జీజీహెచ్ అభివృద్ధికి కృషి

**450 పడకల ఆసుపత్రి నిర్మాణంలో వేగం పెంచాలి.. ఎమ్మెల్యే సంజయ్ కుమార్**

జగిత్యాల, జూన్ 15 (ఈవార్తలు): నిరుపేద రోగులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా జగిత్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జగిత్యాలలో రూ.235 కోట్లతో నిర్మాణ దశలో ఉన్న 450 పడకల అత్యాధునిక నూతన ఆసుపత్రి భవన పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. ఈ ప్రాజెక్టుతో జగిత్యాల జిల్లా ఉత్తర తెలంగాణలోనే ఒక ప్రధాన హెల్త్‌కేర్ హబ్‌గా మారుతుందని ఆయన పేర్కొన్నారు. నిధుల సద్వినియోగం, మౌలిక వసతుల మెరుగుదలపై కలెక్టర్, వైద్య అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఆసుపత్రిని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే డా. సంజయ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, హెచ్‌డీఎస్ సభ్యులు టీవీ సూర్యం, సిరిసిల్ల శ్రీనివాస్, సూపరింటెండెంట్ డా. కృష్ణమూర్తి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. సునీల్, ఆర్‌ఎంవో డాక్టర్ రామకృష్ణ, ఆర్ అండ్ బీ ఈఈ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## కాచిరెడ్డిపల్లి సర్కారు బడిలో ఘనంగా విద్యా పండుగ

**సరస్వతి విగ్రహ ఆవిష్కరణ.. విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ**

గంగాధర, జూన్ 15 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం కాచిరెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పాఠశాలల పునఃప్రారంభాన్ని పురస్కరించుకొని విద్యా పండుగ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించి, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. విద్యా వేడుకలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో దమ్మని రాము, తహసీల్దార్ అంబటి రజిత, సర్పంచ్ కోల మమత శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు డి. శాంత, ఏఏపీసీ చైర్మన్ గంకిడి సంధ్యా రామ్‌చంద్రారెడ్డి, మండల విద్యాధికారి డా. యెలిగేటి మల్లికార్జున్, ఇతర గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపీడీవో దమ్మని రాము విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. తహసీల్దార్ అంబటి రజిత విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి చదవాలని కోరారు. సర్పంచ్ కోల మమత శ్రీనివాస్ తన కుమార్తెను కార్పొరేట్ పాఠశాల నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉపసర్పంచ్ బైరి మహేందర్ రెడ్డి కుమార్తె కూడా ఈ పాఠశాలలో చదువుతున్నారు. పాఠశాల అభివృద్ధికి బచ్చు ప్రభాకర్ అందించిన సహకారం ప్రశంసలు అందుకుంది. ఆయన డ్యూయల్ డెస్కులు, ఫ్యాన్లు, తరగతి గదుల మరమ్మతులు చేపట్టారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్న ఈ కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది.

# చొప్పదండిని నం.1 చేస్తా

## గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటా.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సర్కారు

**రెండేళ్లలో నియోజకవర్గానికి నిధుల వరద**

**నారాయణపూర్ కూడికాల్వను పూర్తి చేస్తాం**

**ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వెల్లడి**



గంగాధర, జూన్ 15 (ఈవార్తలు): చొప్పదండి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రానికే రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. సోమవారం గంగాధర మండలం వెంకటయ్యపల్లి ఎల్కే గార్డెన్ లో నిర్వహించిన చొప్పదండి నియోజకవర్గం కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లపాటు తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులకు అప్పగా మార్చాలని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ వరిస్తే ఉరే అని, రైతులు వరి సాగు చేయొద్దని చెప్పాడని, నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ చెల్లిస్తున్నాడని పేర్కొన్నారు. గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఇందిరమ్మ ఇల్లు ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చొప్పదండి నియోజకవర్గం లోని 3500 ఇందిరమ్మ ఇళ్ళను ఇచ్చినట్లు, మరో 2500 ఇండ్లను కేటాయించినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందజేస్తున్నట్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, గృహ జ్యోతి క్రింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న బియ్యం అందజేస్తున్నట్లు తెలిపారు. గత పది ఏళ్లలో చొప్పదండి నియోజకవర్గం లో అభివృద్ధి జరగలేదని తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత చొప్పదండి మండలానికి ఇంటిగ్రేటెడ్ కళాశాల, రామడుగు మండలానికి అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్, గంగాధర మండలానికి డిగ్రీ కళాశాల, బోయిన్పల్లి మండలానికి మినీ స్టేడియం, కొడిమ్యాల మండలానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్, కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయంకి 35 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. నారాయణపూర్ రిజర్వాయర్ భూసేకరణ కోసం 23. 5 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. గంగాధర మండలం నారాయణపూర్ గ్రామ రైతులపై తాను కేసులు పెట్టించినట్లు బిఆర్ఎస్ పార్టీ నాయకులు అబద్ధపు ప్రచారం చేస్తున్నారని, అక్కడ కేసులు పెట్టింది టిఆర్ఎస్ మహిళా నాయకురాలని, కేసులు నమోదయింది బిఆర్ఎస్ పార్టీ నాయకుల పైనేనని పేర్కొన్నారు. పూడూరు, గంగాధర చొప్పదండి లో ధర్నాలు చేసినప్పుడు కేసులు నమోదు కాలేదని గుర్తు చేశారు. నారాయణపూర్ కుడికాల నిర్మాణం పూర్తయితే మేడిపల్లి సత్యం కు ఎక్కడ పేరొస్తుందోనని బిఆర్ఎస్ పార్టీ నాయకులు కుట్ర పన్నుతున్నారని, వారిని కుట్రలు పండిన కుడి కాలువ నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. రానున్న రోజుల్లో చొప్పదండి నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో నిలుపుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బూతు లెవెల్ సమావేశ పరిశీలకుడు నమిండ్ల శ్రీనివాస్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ సత్తు మల్లేశం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, టిపిసిసి సభ్యుడు గోగురి మహిపాల్ రెడ్డి,ఆరు మండలా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, జవ్వాజి హరీష్, మంత్రి మహేందర్, కొమ్మనబోయిన సువిన్ యాదవ్, గోగురి నాగభూషణ్ రెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దుబ్బాసి బుచ్చయ్య, భీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సత్య ప్రసన్నారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రోమల రమేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కోల రమేష్ ,కరీంనగర్, సిరిసిల్ల బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, కూస రవీందర్, చొప్పదండి మున్సిపల్ చైర్మన్ వడ్లూరి సరిత శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్లు వెలిచాల తిర్మల్ రావు, రాజ నరసింగరావు ,మార్కెట్ కమిటీ చైర్మన్లు పోతూరి మహేష్, బోయిని ఎల్లేష్ యాదవ్, బొమ్మరవేణి తిరుమల, జాగరిపు రజిత, మరియు సర్పంచులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు బూతులు ఏజెంట్స్ పాల్గొన్నారు.

## ధర్మపురి బస్టాండ్‌లో కొత్త ప్లాట్‌ఫాంలు

**13 కొత్త రూట్లలో బస్సు సౌకర్యం.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వెల్లడి**



ధర్మపురి, జూన్ 15 (ఈవార్తలు): ధర్మపురి బస్టాండ్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి అన్ని విధాల అభివృద్ధి చేస్తామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం ఆర్టిసి కరీంనగర్ ఈడీ సోలామన్ కరీంనగర్ ఆర్ ఎం రాజు, జగిత్యాల డిపో మేనేజర్ తో కలిసి ధర్మపురి బస్టాండ్ మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అడ్లూరి మాట్లాడుతూ ధర్మపురి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే నియోజకవర్గానికి ఐటిఐ తో పాటు డిగ్రీ కళాశాల మంజూరు చేయించామని త్వరలోనే బస్సు డిపో సాధిస్తామని అన్నారు. ధర్మపురి బస్టాండ్ అభివృద్ధికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నిధులు ఇవ్వడానికి అంగీకరించారని అన్నారు. ధర్మపురి నుండి నిత్యం 4వేల నుంచి 5వేల మంది ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రత్యేక నిధులతో బస్టాండ్ లో రెండు కొత్త ప్లాట్ ఫాంలు నిర్మిస్తామని మంత్రి తెలిపారు. రానున్న రోజుల్లో భక్తుల సౌకర్యాల కొరకు తాగునీటి తో పాటు శానిటేషన్ పనులు చేయిస్తామని మంత్రి తెలిపారు. ధర్మపురి నుండి వివిధ గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉండే విధంగా కొత్తగా 13 రూట్లలో బస్సులు నడిపేందుకు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. కరీంనగర్ నుండి రాత్రి 8 గంటలకు ప్రత్యేక బస్సు ధర్మపురి వరకు వస్తుందని ఇది చాలామంది ప్రయాణికులకు ఉపయోగంగా ఉంటుందన్నారు. ఉదయం 8 గంటలకు ధర్మపురి నుండి ప్రత్యేక బస్సు కరీంనగర్ కు నడిపిస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ధర్మపురి నియోజకవర్గంలో ప్రయాణికులు బస్సుల కొరకు వేచి చూడకుండా ఆర్టీసీ సేవలు అందజేస్తామని మంత్రి తెలిపారు..



## కరెంటు పేరిట చెట్ల కోతలు

**పచ్చదనం సంరక్షణకు చర్యలు తీసుకోండి**

**కలెక్టర్‌కు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ వినతి**

జగిత్యాల బ్యూరో, జూన్ 15 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా వ్యాప్తంగా విద్యుత్ శాఖ నిర్వహణ, విద్యుత్ లైన్ల క్లియరెన్స్ పనుల సందర్భంగా చెట్లను విచక్షణారహితంగా తొలగించడం, అధికంగా కొమ్మలు నరికివేయడం వల్ల పచ్చదనం తగ్గిపోతోందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేసి, విద్యుత్ శాఖ అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా కొనసాగించడం, ప్రజల భద్రతను కాపాడడం ఎంత ముఖ్యమో, చెట్ల సంరక్షణ కూడా అంతే బాధ్యతగా తీసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అవసరమైన చోట చెట్లను పూర్తిగా తొలగించకుండా, విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న కొమ్మలను మాత్రమే తొలగించే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. పెద్ద చెట్లు పర్యావరణ సమతుల్యత, గాలి నాణ్యత మెరుగుదల, జీవ వైవిధ్య పరిరక్షణ, భూగర్భ జలాల సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు చెట్ల సంరక్షణ కూడా సమతుల్యంగా కొనసాగాలని అన్నారు. చెట్ల తొలగింపు వంటి పనులు చేపట్టే ముందు అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని, జిల్లా పచ్చదనాన్ని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# ఎమ్మెల్యే.. నీ పనితీరేది?

**యావర్ రోడ్డు విస్తరణపై చిత్తశుద్ధి నిరూపించు**

**అక్రమ నిర్మాణాలు తొలగించి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలి**

**సీఎంతో కలిసి పనిచేస్తే ఫలితం ఎక్కడ?**

**ఎమ్మెల్యేకు సీఎం పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చారా?**

**మాజీ మంత్రి జీవన్‌రెడ్డి మండిపాటు**



జగిత్యాల బ్యూరో, జూన్ 15 (ఈవార్తలు): యావర్ రోడ్డు విస్తరణ, ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం యావర్ రోడ్డు విస్తరణ, అక్రమ నిర్మాణాల తొలగింపు అంశాలపై ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. యావర్ రోడ్డు విస్తరణకు 1994లో 60 అడుగుల మాస్టర్ ప్లాన్‌కు అనుమతి లభించిందని, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజలను ఒప్పించి 40 అడుగుల నుంచి 60 అడుగులకు విస్తరించామని తెలిపారు. అనంతరం 100 అడుగుల రోడ్డు విస్తరణకు తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపినప్పటికీ అది ప్రచారానికే పరిమితమైందన్నారు. ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేయగా, విస్తరణకు రూ.100 కోట్లు అవసరమంటూ జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక పంపారని గుర్తుచేశారు. సీఎంతో కలిసి పనిచేస్తున్నానని చెప్పే ఎమ్మెల్యే సంజయ్ కుమార్ రెండేళ్లుగా అధికారంలో ఉన్నప్పటికీ రోడ్డు విస్తరణకు నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఒకవైపు సీఎం వద్ద ఫైల్ సిద్ధంగా ఉండగా, మరోవైపు మున్సిపల్ కమిషనర్‌కు లేఖలు రాయడం విడ్డూరంగా ఉందన్నారు. యావర్ రోడ్డుపై అక్రమ నిర్మాణాలను తొలగించాలని కలెక్టర్‌కు గతంలో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా రోడ్లపై చిన్న వ్యాపారాలు చేసుకునే నిరుపేదలపై మాత్రమే అధికారులు ప్రతాపం చూపుతున్నారని ఆరోపించారు. మున్సిపాలిటీకి చెందిన సర్వే నంబర్ 138లో పెట్రోల్, డీజిల్, కిరోసిన్ ఔట్‌లెట్ కోసం కేటాయించిన 20 గుంటల భూమిలో కేవలం నాలుగు గుంటలు మాత్రమే వినియోగిస్తూ, మిగిలిన భూమిని ఇతర వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై కోర్టు తీర్పులు, మున్సిపల్ తీర్మానాలు ఉన్నప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కూడా అభివృద్ధిలో భాగమేనని, అక్రమ నిర్మాణాల తొలగింపు, ప్రభుత్వ భూముల రక్షణ విషయంలో జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యావర్ రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయించడంతో పాటు ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు ఎమ్మెల్యే చొరవ చూపాలని కోరారు. సమావేశంలో దావ వసంత సురేష్, హరిచరణ్‌రావు, తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్‌రెడ్డి, మాజీ చైర్మన్ దేశాయి, పట్టణ అధ్యక్షుడు అయిల్నేని వెంకటేశ్వరరావు, ముఖసీర్ అలీ నిహాల్, దుర్గయ్య, జున్ను రాజేందర్ సర్పంచ్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి

**కలెక్టర్‌కు బీజేపీ నాయకుల వినతి**

జగిత్యాల, జూన్ 15 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను దోపిడికి గురిచేస్తున్నాయని బీజేపీ సీనియర్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనుమతులు లేని కొన్ని పాఠశాలలు కూడా కొనసాగుతున్నాయని, అనేక విద్యాసంస్థల్లో కనీస వసతులైన పార్కింగ్, ఆట స్థలాలు లేకపోగా, ఇరుకు గదుల్లో సామర్థ్యానికి మించి విద్యార్థులను కూర్చోబెట్టి బోధన సాగిస్తున్నారని పేర్కొన్నారు. పుస్తకాలు, షూస్, యూనిఫాంలు తదితర వస్తువులను తమ పాఠశాలల్లోనే కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తూ అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ర్యాంకులు, మార్కుల కోసం విద్యార్థులపై అధిక ఒత్తిడి పెంచడం వల్ల వారు మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడంతో యాజమాన్యాల ఆగడాలు పెరుగుతున్నాయని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడిని అరికట్టడంతో పాటు ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఏసీఎస్ రాజు, సిపెల్లి రవీందర్, లింగంపేట శ్రీనివాస్, అరవ లక్ష్మి, అంకార్ సుధాకర్, చీటి చంద్రశేఖర్ రావు, జువ్వాడి శ్రీకాంత్ రావు, ఠాకూర్ కిషోర్ సింగ్, ఎర్ర శీను, ప్రమోద్ గౌడ్, ఎండీ సుమీర్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద ప్రాంతాల్లో పోలీసుల తనిఖీలు



గంధార, జూన్ 15 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా గంగాధర, చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండలం మధురానగర్ గ్రామంలో ఎస్సై వంశీకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ నుంచి వచ్చిన క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందాలు పాల్గొన్నాయి. గ్రామంలోని పాన్‌షాపులు, వైన్స్ పర్మిట్ రూమ్‌లు, పాఠశాలలు, ఇతర అనుమానాస్పద ప్రాంతాల్లో అక్రమంగా గంజాయి, మాదక ద్రవ్యాలు వంటి నిషేధిత పదార్థాలు నిల్వ ఉంచుతున్నారా లేదా విక్రయిస్తున్నారా అనే అంశాలపై క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. డాగ్ స్క్వాడ్ సహాయంతో ప్రతి ప్రాంతాన్ని పరిశీలించి అనుమానాస్పద వస్తువుల కోసం గాలింపు నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. గ్రామ పరిసరాల్లో ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాగ్ స్క్వాడ్ బృందం, క్లూస్ టీమ్ సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## లవ్లీ చిత్రం



మీనాక్షి చౌదరి

## విజయ్ - సంగీత విడాకుల
# కేస్ మళ్లీ వాయిదా



కోలీవుడ్ సినీ ఇండస్ట్రీలో క్యూట్ జంటగా పేరు దక్కించుకొని అందరికీ ఆదర్శంగా నిలిచారు విజయ్ - సంగీత.. రెండు దశాబ్దాలకు పైగా సవ్యంగా సాగిన వీరి కాపురం బీటలు వారింది. 2026 సంవత్సరం వీరి బంధానికి కలిసి రాలేదు. పైగా వీరికి జాసన్ సంజయ్ , దివ్యసాష అనే ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. ఇలాంటి సమయంలో వీరు విడాకులు కోరడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ముఖ్యంగా వీరు తీసుకోవడానికి గల కారణం ఏంటి అంటూ ఎంతోమంది ఆరా తీశారు. పైగా ఒక సినీ నటితో విజయ్ రిలేషన్ లో ఉన్నారని ఆమె ఆరోపించింది. కానీ ఎక్కడ ఆమె పేరును బయట పెట్టలేదు. అయితే వీళ్ళిద్దరూ (త్రిష-విజయ్)కలిసి బహిరంగంగా కనిపించడంతో అందరూ త్రిష పేరును ప్రస్తావిస్తున్నారు. అటు విజయ్ రాజకీయంగా అడుగులు వేస్తున్న సమయంలో ఆయన వెన్నంటే నిలిచింది త్రిష. ఎన్నికల సమయంలో హడావిడి చేసింది. అంతేకాదు ఎన్నికల ఫలితాల సమయంలో కూడా నేరుగా తిరుపతి నుండి విజయ్ ఇంటికి వెళ్లి ఆయనను అభినందించింది. అంతేకాదు విజయ్ ప్రమాణ స్వీకారం సమయంలో కూడా స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచి అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఇక అలా వీళ్ళిద్దరి వల్లే ఆమె విడాకులు తీసుకోబోతోంది అని చాలామంది పలు రకాల కామెంట్లు కూడా చేశారు. అటు కోర్టులో విచారణ కూడా జరుగుతోంది. ఇప్పటికే ఆన్లైన్ ద్వారా ఒకసారి విచారణ జరగగా.. ఇప్పుడు మరోసారి ఈ విడాకుల కేసు ఈరోజు విచారణకు వచ్చింది. ఈ విడాకుల కేసు పిటిషన్ పై విచారణ జరిపిన చెంగల్పట్టు మహిళా కోర్టు ఈ విడాకుల కేసు విచారణను ఆగస్టు 7కు వాయిదా వేసింది. ఇకపోతే ఈ కేసును మళ్లీ వాయిదా వేయడంతో అందరిలో అనుమానాలు రేకెత్తుతున్నాయి. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సమయంలో ఆయన కోర్టు చుట్టూ తిరగడం సవ్యంగా లేదని పలువురు రాజకీయ ప్రముఖులు కూడా కామెంట్ చేస్తున్నారు. పైగా ఇలాంటి సమయంలో ఈ విడాకుల కేసు వాయిదా పడడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది.

## ఐశ్వర్యను ఆంటీ అంటే తప్పేంటి?: సోనమ్




నటీనటుల మధ్య సంభాషణలు.. ఒకరిపై ఒకరు చేసే వ్యాఖ్యలు తరచుగా వివాదాలకు దారితీస్తుంటాయి. ముఖ్యంగా బాలీవుడ్‌లో స్టార్స్ మధ్య ఉండే సంబంధాలు, పబ్లిక్ వేదికలపై వారు మాట్లాడే మాటలు మీడియాలో హాట్ టాపిక్‌గా మారుతుంటాయి. కొన్నిసార్లు నటీనటులు ఎంతో సాధారణంగా అన్న మాటలు కూడా అభిమానుల మధ్య ..పరిశ్రమలో చర్చకు, మనస్పర్థలకు కారణమవుతుంటాయి. ఇలాంటి ఓ పాత ఐకానిక్ వివాదం బాలీవుడ్ స్టార్స్ సోనమ్ కపూర్ - ప్రపంచ సుందరి ఐశ్వర్య రాయ్ బచ్చన్ మధ్య చోటుచేసుకుంది. ఓ సందర్భంలో 36 ఏళ్ల వయసులో ఉన్న ఐశ్వర్య రాయ్‌ను సోనమ్ కపూర్ బహిరంగంగా ఆంటీ అని పిలవడం ఇండస్ట్రీ వర్గాలలో పెద్ద సంచలనం సృష్టించింది. ఒక యువ నటి అంతటి సీనియర్ .. క్రేజ్ ఉన్న అగ్ర కథానాయకిని అలా సంబోధించడంపై అప్పట్లో మీడియాలో రకరకాల కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో సోనమ్ కపూర్ తన మాటలను సమర్థించుకుంటూ ఆసక్తికర వివరణ ఇచ్చారు. ఐశ్వర్య రాయ్ తన తండ్రి అనిల్ కపూర్‌తో కలిసి స్క్రీన్ పంచుకున్నారని.. ఆయనకు జోడీగా నటించారని సోనమ్ గుర్తుచేశారు. ఆ రకంగా చూస్తే ఐశ్వర్య తనకంటే ఎంతో సీనియర్ అని.. అందుకే తాను ఆమెను ఆంటీ అని పిలవడంలో తప్పులేదని భావించినట్లు సోనమ్ స్పష్టం చేశారు.

## లేడీ డాన్‌గా కాజల్ అగర్వాల్!



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ సెకండ్స్ ఇన్నింగ్స్‌లో ఫుల్ ఫామ్‌లో ఉన్నారు. భారీ ప్రాజెక్ట్స్‌లో నటించే అవకాశం దక్కించుకుంటూ.. తీరిక లేకుండా గడుపుతున్నారు. ఇప్పటికే ది ఇండియన్ స్టోరీ, రామాయణ, ఎన్‌బీకే-111 వంటి సినిమాల్లో నటిస్తున్న కాజల్ ఓటీటీలోనూ రాణించేందుకు ప్రయత్నిస్తున్నట్లు టాక్. తాజాగా ఆమె ఒక వెబ్ సిరీస్‌లో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, షూటింగ్‌ను కూడా పూర్తి చేసినట్లు వార్తలు వస్తున్నాయి. 'స్వామిరారా' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న టాలెంటెడ్ డైరెక్టర్ సుధీర్ వర్మ దర్శకత్వంలో ఈ సిరీస్ రూపొందుతోంది. దీనికి 'విశాఖ' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సిరీస్‌లో కాజల్ అగర్వాల్ మునుపెన్నడూ చూడని విధంగా ఒక పవర్‌ఫుల్ లేడీ డాన్ పాత్రలో కనిపించబోతున్నారట. ఇందులో ఆమె చేసే యాక్షన్ సీన్స్ సిరీస్‌కే ప్రధాన హైలైట్‌గా నిలవనున్నాయని సమాచారం. అయితే, ఈ ప్రాజెక్ట్ బాలీవుడ్‌లో సుస్మితా సేన్ ప్రధాన పాత్రలో నటించి సంచలన విజయం సాధించిన 'ఆర్య' వెబ్ సిరీస్‌కు అధికారిక తెలుగు రీమేక్‌గా వస్తున్నట్లు తెలుస్తోంది. కుటుంబం కోసం ఒక సాధారణ మహిళ ఎలాంటి పరిస్థితుల్లో అండర్‌వరల్డ్ లేడీ డాన్‌గా మారాల్సి వచ్చింది అనే ఆసక్తికరమైన కథాంశంతో ఇది సాగుతుందని టాక్.

# త్రిష రెమ్యునరేషన్ డబుల్?




సౌత్ సినీ ఇండస్ట్రీలో రెండు దశాబ్దాలకు పైగా టాప్ హీరోయిన్ గా కొనసాగుతున్న త్రిష మరోసారి చర్చనీయాంశంగా మారారు. ప్రస్తుతం ఆమె రెమ్యూనరేషన్ కు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. వరుస విజయాలతో కెరీర్ లో మరోసారి స్ట్రాంగ్ ఫేజ్ కు చేరుకున్న త్రిష, కొత్త ప్రాజెక్టుల విషయంలో తన డిమాండ్ పెంచినట్లు ప్రచారం జరుగుతోంది. త్రిష కెరీర్ ను పరిశీలిస్తే, హిట్లు-ఫ్లాపులు ఉన్నాయి. అయితే ప్రతిసారి చిన్న బ్రేక్ తర్వాత ఆమె మళ్లీ స్ట్రాంగ్ గా కమ్ బ్యాక్ ఇచ్చి టాప్ ప్లేస్ లో నిలిచిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇటీవల కొన్ని చిత్రాలు అనుకున్న రేంజ్ లో విజయాన్ని అందుకోకపోయినా, తాజా విజయంతో ఆమె మార్కెట్ మళ్లీ ఫుల్ గా పెరిగిందని టాక్ వినిపిస్తోంది. త్రిషకు గోల్డెన్ ఫేజ్ నడుస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పెద్ద హీరోల చిత్రాల్లో అవకాశాలు వరుసగా రావడం, పాన్ ఇండియా రేంజ్ లో ఆమెకు గుర్తింపు ఉండటం, ప్రేక్షకుల్లో ఇప్పటికీ మంచి రెస్పాన్స్ కొనసాగడం ఇందుకు కారణాలుగా చెప్పాలి. యంగ్ హీరోయిన్లు నుంచి తీవ్ర పోటీ ఉన్నప్పటికీ, ఎక్స్పీరియన్స్, యాక్టింగ్, సిల్వర్ స్క్రీన్ పై ఆకర్షణతో ఆమె తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకుంటున్నారు. ఇటీవల భారీ చిత్రం విజయంతో త్రిష క్రేజ్ మరింత పెరిగిందని సినీ ఎక్స్పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు.

## 24 నుంచి ఓటీటీలోకి అవతార్ 3



జేమ్స్ కామెరాన్ దర్శకత్వంలో తెరకెక్కిన అద్భుతకావ్యం 'అవతార్'. ఈ విజువల్ వండర్ నుంచి వచ్చిన రెండు భాగాలు అత్యధిక ప్రేక్షకాదరణను పొంది రూ.కోట్లల్లో వసూలు రాబట్టాయి. దీంతో మూడో భాగం 'అవతార్ - ఫైర్ అండ్ యాష్'ను కూడా గతేడాది ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు మేకర్స్. ఆడియన్స్‌ను మరో లోకంలోకి తీసుకెళ్లిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని సాధించింది. ఇప్పుడు డిజిటల్ ఆడియన్స్ ముందుకు వచ్చేందుకు సిద్ధం అయింది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ భారీ ధరకు సొంతం చేసుకోగా.. ఈ నెల 24 నుంచి తెలుగు, తమిళ, ఇంగ్లీష్, హిందీ భాషల్లో అందుబాటులోకి రానున్నట్లు అఫీషియల్‌గా ప్రకటించారు.

## శార్వరి వాఘ్ 'లవ్ స్టోరీ'!



బాలీవుడ్ యంగ్ బ్యూటీ శార్వరీ వాఘ్ ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీ బిజీగా మారిపోయారు. ఇటీవల 'మై వాపస్ ఆవుంగా' సినిమాతో ప్రేక్షకులను అలరించిన ఈ ముద్దుగుమ్మ, ఇప్పుడు యష్ రాజ్ ఫిల్మ్స్ ప్రతిష్టాత్మక స్పై యూనివర్స్ చిత్రం 'ఆల్ఫా' లో పవర్‌ఫుల్ యాక్షన్ రోల్‌లో కనిపించబోతున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమా జూలై 3న విడుదల కానుండటంతో వచ్చే వారం నుండే ప్రమోషన్స్ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఇది కాకుండా, సూరజ్ బర్జాత్యా దర్శకత్వంలో ఆమె నటించిన 'యే ప్రేమ్ మోల్ లియా' చిత్రం కూడా 2026 చివరిలో విడుదల కానుంది. ఇదిలా ఉంటే, తాజాగా, శార్వరీ ఖాతాలో మరో భారీ ప్రాజెక్ట్ చేరినున్నట్లు వార్తలు వస్తున్నాయి. యూత్‌ఫుల్ సినిమాలను అందించిన టాప్ డైరెక్టర్ లవ్ రంజన్.. తన తదుపరి చిత్రంలో శార్వరీని హీరోయిన్‌గా తీసుకోవాలని భావిస్తున్నారట. ఇది లవ్ స్టోరీగా రాబోతుండగా.. ఈ సినిమాలో కార్తీక్ ఆర్యన్ హీరోగా నటిస్తున్నారు. లవ్ రంజన్ దర్శకత్వంలో కార్తీక్ సరసన నటించే అవకాశం రావడంపై శార్వరీ కూడా ఆసక్తిని కనబరుస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం లవ్ రంజన్ ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్‌ను పూర్తి చేసే పనిలో ఉన్నారట. ఈ ఏడాది ఈ చిత్రాన్ని సెట్స్ పైకి కూడా తీసుకెళ్లాలని ఆయన ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో నిజమేంత అనేది తెలియనప్పటికీ ఇందుకు సంబంధించిన పోస్టులు మాత్రం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# కార్తీక్ ఆర్యన్‌తో శ్రీలీల లవ్ కన్ఫర్మ్!



బాలీవుడ్ యంగ్ హీరో కార్తీక్ ఆర్యన్, టాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీల గత కొద్దికాలంగా ప్రేమలో ఉన్నారంటూ సోషల్ మీడియాలో రకరకాల పుకార్లు షికారు చేస్తున్నాయి. ఈ విషయంపై వీరిద్దరు ఇప్పటివరకు అధికారికంగా ఎక్కడా స్పందించనప్పటికీ, తాజాగా జరిగిన ఒక సంఘటన వీరి ప్రేమ వార్తలకు మరింత బలాన్ని చేకూర్చింది. శ్రీలీల పుట్టినరోజును పురస్కరించుకుని కార్తీక్ ఆర్యన్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఒక ఇంట్రెస్టింగ్ ఫొటోను షేర్ చేస్తూ.. హ్యాపీ బర్త్ డే శ్రీ శ్రీ అంటూ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఆ ఫొటోలో కార్తీక్ బైక్ నడుపుతుండగా, వెనుక కూర్చున్న శ్రీలీల బైక్ రియర్ వ్యూ మిర్రర్‌లో చూసుకుంటూ క్యూట్‌గా చిరునవ్వులు చిందిస్తూ కనిపించారు. ఈ రేర్ పిక్ చూసి అభిమానులు తెగ మురిసిపోతున్నారు. అయితే, అసలు కథ ఇక్కడే మొదలైంది. కార్తీక్ ఆర్యన్ పెట్టిన ఈ బర్త్‌డే పోస్ట్‌కు శ్రీలీల స్పందిస్తూ.. థాంక్యూ స్వీటెస్ట్ అని రిప్లై ఇచ్చింది. అంతటితో ఆగకుండా ఆ మెసేజ్‌కు ఒక లవ్ సింబల్ ను కూడా జోడించడంతో ప్రేమపై హింట్ ఇచ్చిందని అంతా అనుకుంటున్నారు. వీరిద్దరి మధ్య ఉన్నది కేవలం స్నేహం మాత్రమే కాదు, అంతకుమించి ఏదో ఉందంటూ నెటిజన్లు చర్చించుకుంటున్నారు. వీరిద్దరి మధ్య ఉన్న ప్రేమ నిజమేనంటూ సోషల్ మీడియాలో వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి. కాగా.. వీరిద్దరి కాంబోలో ఓ రొమాంటిక్ మ్యూజికల్ డ్రామా రాబోతుంది. అనురాగ్ బసు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీని భూషన్ కుమార్, క్రిషన్ కుమార్ టీ-సిరీస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ప్రీతమ్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను వచ్చే ఏడాది దీపావళికి విడుదల చేయాలని చిత్రబృందం ప్లాన్ చేస్తున్నారు.

## దోహా డైమండ్ లీగ్‌తో బరిలోకి నీరజ్ చోప్రా




ఏడాది కాలంగా పలు పోటీలకు దూరమైన నీరజ్ చోప్రా బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నాడు. వెన్ను గాయం నుంచి కోలుకుని ఫిటెనెస్ సాధించిన చోప్రా.. కామన్‌వెల్త్ క్రీడలకు ముందే ఈటెను విసరనున్నాడు. జూన్ 19 నుంచి మొదలయ్యే దోహా డైమండ్ లీగ్‌లో భారత స్టార్ పోటీ పడనున్నాడు. ఈ టోర్నీలో మెరిసి కామన్‌వెల్త్ క్రీడల్లో పతకం పట్టేయాలని చోప్రా భావిస్తున్నాడు. భారత అథ్లెటిక్స్‌లో కొత్త చరిత్ర లిఖించిన నీరజ్ చోప్రా త్వరలోనే పునరాగమనం చేయనున్నాడు. చివరగా నిరుడు జపాన్‌లో వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో పోటీపడిన చోప్రా.. దోహా డైమండ్ లీగ్‌లో ఆడనున్నాడు. స్విట్జర్లాండ్‌లో కోలుకుని, ఫిట్‌నెస్ మెరుగుపరచుకున్న జావెలిన్ త్రోయర్.. దేశం గర్వపడేలా చేయాలని ఉవ్విళ్లూరుతున్నాడు. మొన్నటివరకూ చోప్రా రీ ఎంట్రీపై నెలకొన్న సందేహాలు పటాపంచలవ్వగా.. ప్రత్యర్థుల్లో కంగారు మొదలైంది. ఎందుకంటే నిరుడు ఇదే టోర్నీలో 90 మీటర్ల దూరం ఈటెను విసిరిన చోప్రా.. వ్యక్తిగతంగా అత్యుత్తమ ప్రదర్శన కనబరిస్తే కామెన్‌వెల్త్‌లో పతకం ఖాయమైనట్టే. వరసగా రెండు ఒలింపిక్స్‌లో పసిడి, రజతంతో మెరిసిన నీరజ్ చోప్రా కామన్‌వెల్త్ క్రీడలకు ఎంపికయ్యాడు. దోహా డైమండ్ లీగ్‌కు దూరమైన నీరజ్‌ను భారత అథ్లెటిక్స్ సమాఖ్య(ఏఎఫ్ఐ) ఈ మెగా ఈవెంట్‌కు తీసుకుంది. ప్రస్తుతం వెన్ను గాయం నుంచి కోలుకున్న చోప్రాపై భారీ అంచనాలే ఉన్నాయి.

## శ్రీలంక ఆటగాళ్లతో వైభవ్ వాగ్వాదం

శ్రీలంక-'ఏ' జట్టుతో జరిగిన ఉత్కంఠభరిత పోరులో భారత్-'ఏ' జట్టు సూపర్ ఓవర్‌లో పరాజయం పాలైంది. అయితే, మ్యాచ్ ఫలితం కంటే కూడా ముగింపు అనంతరం చోటుచేసుకున్న పరిణామాలే ఇప్పుడు క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. భారత యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ శ్రీలంక ఆటగాళ్లతో వాగ్వాదానికి దిగడంతో పాటు తోపులాట జరగడం తీవ్ర కలకలం సృష్టించింది. సోమవారం జరిగిన ఈ త్రైపాక్షిక సిరీస్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన తిలక్ వర్మ సారథ్యంలోని భారత్-'ఏ' జట్టు 49.2 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. సూర్యాంశ్ షెడ్గే (72), విప్రాజ్ నిగమ్ (51) అర్ధసెంచరీలతో రాణించారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన శ్రీలంక-'ఏ' జట్టు సైతం నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి సరిగ్గా 265 పరుగులే చేయడంతో మ్యాచ్ 'టై'గా ముగిసింది. లంక జట్టులో సదీర సమరవిక్రమ (93) కీలక ఇన్నింగ్స్ ఆడారు. అయితే, చివరి ఓవర్‌లో అంపైర్ల నిర్ణయాలు వివాదాస్పదంగా మారడం ఆట సూపర్ ఓవర్‌కు దారితీసేలా చేసింది. సూపర్ ఓవర్‌లో శ్రీలంక-'ఏ' 16 పరుగులు సాధించగా, భారత్-'ఏ' 9 పరుగులకే పరిమితమై ఓటమిని చవిచూసింది. మ్యాచ్ ముగిసిన తర్వాత ఆటగాళ్లు మైదానాన్ని వీడుతున్న తరుణంలో వైభవ్ సూర్యవంశీకి, శ్రీలంక ఆటగాళ్లకు మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన వైభవ్ ప్రత్యర్థి ఆటగాడిని తోయడంతో గందరగోళం నెలకొంది. వెంటనే సహచర ఆటగాళ్లు, మ్యాచ్ అధికారులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను శాంతింపజేశారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్భుతంగా రాణించి వెలుగులోకి వచ్చిన వైభవ్, మైదానంలో ఇలా దూకుడుగా ప్రవర్తించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వివాదంపై మ్యాచ్ అధికారులు ఎలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారనే విషయంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం ఈ సిరీస్‌లో 1-2తో వెనుకబడిన భారత్-'ఏ' జట్టు, ఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే అఫ్ఘనిస్థాన్-'ఏ' జట్టుతో జరగనున్న తదుపరి పోరులో తప్పక విజయం సాధించాల్సి ఉంది.




## సూపర్ ఓవర్‌లో ఓడిన టీమిండియా

ముక్కోణపు వన్డే టోర్నీలో ఇండియా-ఏతో సోమవారం జరిగిన రసవత్తర మ్యాచ్‌లో శ్రీలంక-ఏ జట్టు సూపర్ ఓవర్‌లో విక్టరీ కొట్టింది. తొలుత ఇద్దరి మధ్య మ్యాచ్ టై కాగా, ఆ తర్వాత సూపర్ ఓవర్ ఆడారు. సూపర్ ఓవర్‌లో శ్రీలంక విధించిన లక్ష్యాన్ని భారత్ అందుకోలేక పోయింది. సూపర్ ఓవర్‌లో ఏడు రన్స్ తేడాతో ఇండియా ఓడింది. తొలి మూడు బంతులను షెడ్జ్ ఆడగా, చివరి మూడు బంతులను సూర్యవంశీ ఆడారు. కానీ అతను కేవలం 5 రన్స్ మాత్రమే చేశాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత శ్రీలంక ప్లేయర్లు, సూర్యవంశీ మధ్య వాగ్వాదం జరిగింది. సూర్యవంశీ, లంక ప్లేయర్లు ఒకర్ని ఒకరు తోసుకున్నారు. ఓ లంక ప్లేయర్ ఆ గొడవను ఆపాడు. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఇండియా 49.2 ఓవర్లలో 265 రన్స్ చేసి ఆలౌటైంది. అయితే చేజింగ్‌లో తగ్గాఫార్ నడిచింది. ఇరు జట్లు విజయం కోసం తీవ్రంగా పోరాడాయి. నిర్ణీత 50 ఓవర్‌లో శ్రీలంక ఏ జట్టు 9 వికెట్లు కోల్పోయి 265 రన్స్ చేసింది. ఆఖరి బంతికి రెండు రన్స్ అవసరం కాగా, చమిక గుణశేఖర రనౌట్ అయ్యాడు. దీంతో మ్యాచ్ టై అయ్యింది. మ్యాచ్ టై కావడంతో.. శ్రీలంక, భారత కెప్టెన్లు సూపర్ ఓవర్ ఆడేందుకు సముఖత వ్యక్తం చేశారు. కాసేపు మైదానంలోనే అంపైర్లతో చర్చ జరిగింది. అప్పటికే లైట్ డిమ్ కావడం వల్ల సూపర్ ఓవర్ జరుగుతుందో లేదో టెన్షన్ ఉండే. కానీ సూపర్ ఓవర్‌లో ఫస్ట్ శ్రీలంక బ్యాటింగ్ చేసింది. భారత పేసర్ అర్షద్ ఖాన్ ఆ ఓవర్ వేశాడు. ఆ సూపర్ ఓవర్‌లో శ్రీలంక వికెట్ నష్టపోకుండా 16 రన్స్ స్కోరు చేసింది. 17 రన్స్ టార్గెట్‌తో సూపర్ ఓవర్‌లో బరిలోకి దిగిన భారత్.. కేవలం 10 రన్స్ మాత్రమే చేసింది. దీంతో శ్రీలంక ఏ జట్టును విజయం వరించింది. ఇండియన్ ఇన్నింగ్స్‌లో సూర్యవంశీ 21, రుతురాజ్ 37, సూర్యాంశ్ షెడ్జ 72, విప్రాజ్ నిఘమ్ 51 రన్స్ చేశారు. చేజింగ్‌లో లంక బ్యాటర్ సమరవిక్రమ అద్భుత బ్యాటింగ్ చేశాడు. అతను కీలకమైన 93 రన్స్ చేశాడు. లంక బ్యాటర్లలో డిక్‌వెల్ల 37, ఫెర్నాండో 22, వనుస సహాన్ 25 రన్స్ చేశారు. అయితే థ్రిల్లింగ్‌గా సాగిన మ్యాచ్‌లో చివరకు ఎందుకు ఘర్షణ జరిగిందో ఇంకా స్పష్టంగా తెలియదు. సూర్యవంశీ, షెడ్జ జోడిని సూపర్ ఓవర్‌లో విజయవంతంగా లంక బౌలర్లు అడ్డుకోగలిగారు.

## టీజీ20 లీగ్ షెడ్యూల్ రిలీజ్

యువ ప్రతిభను వెలికితీయడంతోపాటు తెలంగాణ క్రికెట్‌కు కొత్త ఉత్సాహం తీసుకురావాలనే లక్ష్యంతో హెచ్‌సీఏ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న టీజీ-20 లీగ్ ప్రారంభానికి రంగం సిద్ధమైంది. జట్ల ఎంపిక, ప్లేయర్ల వేలం ఇప్పటికే పూర్తి కాగా అన్ని ఫ్రాంఛైజీల ఆటగాళ్లు ముమ్మరంగా ప్రాక్టీస్ చేస్తూ బిజిబిజీగా ఉన్నారు. జూన్ 21 నుంచి మొదలుకానున్న ఈ టోర్నీ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను తాజాగా విడుదల చేశారు. లీగ్‌లో ఎనిమిది జట్లు పోటీపడుతుండగా.. ప్రతి జట్టు మిగతా అన్ని టీమ్‌లతో ఒక్కో మ్యాచ్ ఆడతుంది. తొలి మ్యాచ్‌లో పాలమూరు స్ట్రైకర్స్, అన్విత ఖమ్మం ఏసెస్ తలపడనున్నాయి. జూన్ 23న పాలమూరుతో జరిగే మ్యాచ్‌తో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ లీగ్‌ను ఆరంభించనుంది. జూలై 7న లీగ్ దశ ముగుస్తుంది. 12న ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తారు. మ్యాచ్‌లన్నీ ఉప్పల్ స్టేడియంలో జరుగుతాయి. లీగ్ దశ ముగిసేసరికి పాయింట్ల పట్టికలో మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు జూలై 9న ఎలిమినేటర్ మ్యాచ్ తలపడతాయి. ఇందులో ఓడిన టీమ్ ఇంటిముఖం పడుతుంది. గెలిచిన జట్టు క్వాలిఫయర్-2కు అర్హత సాధిస్తుంది. జూలై 9న రాత్రి జరిగే క్వాలిఫయర్-1లో పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఢీకొంటాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు దూసుకెళ్తుంది. ఓడిన జట్టు జూలై 10న రెండో క్వాలిఫయర్‌లో ఎలిమినేటర్ విజేతతో తలపడనుంది. దీంట్లో విజయం సాధించిన జట్టు ఫైనల్‌కు వెళ్తుంది. జూలై 12న టైటిల్ పోరు ఉంటుంది.

### లీగ్ స్టేజ్ మ్యాచ్‌ల షెడ్యూల్:

జూన్ 21 - పాలమూరు స్ట్రైకర్స్ వర్సెస్ అన్విత ఖమ్మం ఏసెస్ (రాత్రి 7:15)
జూన్ 22 - రంగారెడ్డి రైజర్స్ వర్సెస్ నల్గొండ నైట్స్ (మధ్యాహ్నం 2: 15)
జూన్ 22 - వరంగల్ వారియర్స్ వర్సెస్ మెదక్ ఫాల్కన్స్ (రాత్రి 7:15 )
జూన్ 23 - పాలమూరు స్ట్రైకర్స్ వర్సెస్ హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ (మధ్యాహ్నం 2: 15)
జూన్ 23 - రంగారెడ్డి రైజర్స్ వర్సెస్ మెదక్ ఫాల్కన్స్ (రాత్రి 7:15 )
జూన్ 24 - అన్విత ఖమ్మం ఏసెస్ వర్సెస్ వరంగల్ వారియర్స్ (మధ్యాహ్నం 2: 15)
జూన్ 24 - నల్గొండ నైట్స్ వర్సెస్ కరీంనగర్ డైమండ్స్ (రాత్రి 7:15 )
జూన్ 25 - రంగారెడ్డి రైజర్స్ వర్సెస్ హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ (మధ్యాహ్నం 2: 15)
జూన్ 25 - పాలమూరు స్ట్రైకర్స్ వర్సెస్ మెదక్ ఫాల్కన్స్ (రాత్రి 7:15 )
జూన్ 26 - నల్గొండ నైట్స్ వర్సెస్ వరంగల్ వారియర్స్ (మధ్యాహ్నం 2: 15)
జూన్ 26 - అన్విత ఖమ్మం ఏసెస్ వర్సెస్ కరీంనగర్ డైమండ్స్ (రాత్రి 7:15 )
జూన్ 27 - మెదక్ ఫాల్కన్స్ వర్సెస్ హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ (మధ్యాహ్నం 2: 15)
జూన్ 27 - పాలమూరు స్ట్రైకర్స్ వర్సెస్ రంగారెడ్డి రైజర్స్ (రాత్రి 7:15 )
జూన్ 28 - వరంగల్ వారియర్స్ వర్సెస్ కరీంనగర్ డైమండ్స్ (మధ్యాహ్నం 2: 15)
జూన్ 29 - పాలమూరు స్ట్రైకర్స్ వర్సెస్ నల్గొండ నైట్స్ (మధ్యాహ్నం 2: 15)
జూన్ 29 - అన్విత ఖమ్మం ఏసెస్ వర్సెస్ హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ (రాత్రి 7:15 )
జూన్ 30 - మెదక్ ఫాల్కన్స్ వర్సెస్ కరీంనగర్ డైమండ్స్ (మధ్యాహ్నం 2: 15)
జూలై 1 - వరంగల్ వారియర్స్ వర్సెస్ హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ (మధ్యాహ్నం 2: 15)
జూలై 1 - అన్విత ఖమ్మం ఏసెస్ వర్సెస్ నల్గొండ నైట్స్ (రాత్రి 7:15 )
జూలై 2 - రంగారెడ్డి రైజర్స్ వర్సెస్ కరీంనగర్ డైమండ్స్ (మధ్యాహ్నం 2: 15)
జూలై 3 - నల్గొండ నైట్స్ వర్సెస్ మెదక్ ఫాల్కన్స్ (మధ్యాహ్నం 2: 15)
జూలై 3 - పాలమూరు స్ట్రైకర్స్ వర్సెస్ వరంగల్ వారియర్స్ (రాత్రి 7:15 )
జూలై 4 - అన్విత ఖమ్మం ఏసెస్ వర్సెస్ రంగారెడ్డి రైజర్స్ (మధ్యాహ్నం 2: 15)
జూలై 4 - కరీంనగర్ డైమండ్స్ వర్సెస్ హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ (రాత్రి 7:15 )
జూలై 5 - బ్రేక్ డే.. మ్యాచ్‌లు లేవు
జూలై 6 - మెదక్ ఫాల్కన్స్ వర్సెస్ అన్విత ఖమ్మం ఏసెస్ (మధ్యాహ్నం 2: 15)
జూలై 6 - నల్గొండ నైట్స్ వర్సెస్ హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ (రాత్రి 7:15 )
జూలై 7 - పాలమూరు స్ట్రైకర్స్ వర్సెస్ కరీంనగర్ డైమండ్స్ (మధ్యాహ్నం 2: 15)
జూలై 7 - రంగారెడ్డి రైజర్స్ వర్సెస్ వరంగల్ వారియర్స్ (రాత్రి 7:15 )




## ఫిఫాలో 'రేసిజం'

2026 ఫిఫా వరల్డ్ కప్‌లో జాత్యహంకార వివాదం చెలరేగింది. లైవ్ టీవీలో ఒక మ్యాచ్ అధికారి వివాదాస్పద చేతి గుర్తును ప్రదర్శించడం తీవ్ర దుమారానికి దారితీసింది. ఆ అధికారిని తక్షణమే వరల్డ్ కప్ విధుల నుంచి తొలగించాలని ఫిఫా వివక్ష నిరోధక పర్యవేక్షక సంస్థ డిమాండ్ చేసింది. అంతర్జాతీయ మీడియా ప్రకారం.. ఆదివారం హ్యూస్టన్‌లో జర్మనీ, కురాకో జట్ల మధ్య మ్యాచ్‌కు ముందు బ్రాడ్‌కాస్టర్లు వీడియో రివ్యూ అనలిస్టుల బృందాన్ని ప్రేక్షకులకు పరిచయం చేశారు. ఆ సమయంలో ఆస్ట్రేలియాకు చెందిన వీడియో అధికారి షాన్ ఎవాన్స్ తన కుడి చేతితో 'ఓకే' గుర్తును తలకిందులుగా చూపిస్తూ కెమెరాకు చిక్కాడు. డల్లాస్‌లోని వరల్డ్ కప్ బ్రాడ్‌కాస్ట్ సెంటర్ నుంచి ఆయన ఈ మ్యాచ్‌కు పనిచేశారు. ఈ తలకిందుల 'ఓకే' గుర్తును శ్వేత జాతీయ అహంకారానికి, ఫార్-రైట్ భావజాలానికి ప్రతీకగా పరిగణిస్తారు. 2019లో న్యూయార్క్‌కు చెందిన యాంటీ-డిఫమేషన్ లీగ్ కూడా దీనిని ద్వేషపూరిత చిహ్నంగా ప్రకటించింది. ఈ ఘటనపై ఫిఫా భాగస్వామ్య సంస్థ అయిన 'ఫేర్ నెట్‌వర్క్' తీవ్రంగా స్పందించింది. ఇదొక 'నియో-నాజీ' సంకేతమని, ప్రపంచం మొత్తం చూస్తున్న సమయంలో కెమెరా ముందు ఉద్దేశపూర్వకంగా ఇలాంటి గుర్తును ప్రదర్శించిన సదరు అధికారిని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేసింది. ఎవాన్స్ ఉద్దేశపూర్వకంగానే ఈ ద్వేషపూరిత గుర్తును ప్రదర్శించాడా..? లేదా సరదాగా చేశారా..? అనేది ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. దీనిపై వివరణ ఇవ్వాల్సిందిగా ఫిఫా, ఆస్ట్రేలియా ఫుట్‌బాల్ సంఘాలను కోరారు. అయితే, ఈ వివాదం నేపథ్యంలో తదుపరి మ్యాచ్‌లలో టీవీ నిర్వాహకులు వీడియో రివ్యూ ప్యానెల్‌ను ప్రేక్షకులకు చూపించడం నిలిపివేసినట్లు తెలుస్తోంది.

## ఫిఫాలో స్నికో మీటర్ సూపర్!

ఆద్యంతం ఉత్కంఠగా సాగుతున్న ఫిఫా వరల్డ్‌కప్ అభిమానులను అలరిస్తోంది. ఈసారి సాకర్ పండుగ ప్రత్యేకత ఏంటంటే.. మునుపెన్నడూ లేని విధంగా గోల్ నిర్ధరణ కోసం క్రికెట్ పరిజ్ఞానం ఉపయోగించారు. క్రికెట్‌లో చాలా సాధారణంగా కనిపించే స్నికో మీటర్ వాడకం అందరిలోనూ ఆసక్తి రేపింది. స్వీడన్, ట్యునీషియా మ్యాచ్‌లో స్నికో మీటర్ ఆధారంగా గోల్ వేసింది ఎవరు? అనేది నిర్ణయించారు. గ్రూప్ ఎఫ్‌లోని స్వీడన్ తొలి మ్యాచ్‌లో అదరగొట్టింది. ట్యునీషియాపై 5-1తో జయబేరి మోగించి ముందంజ వేసింది. అయితే.. మ్యాచ్‌లో నాలుగో గోల్ నిర్ధరణపై ఉత్కంఠ నెలకొనగా రిఫరీలు క్రికెట్ పరిజ్ఞానాన్ని ఆశ్రయించారు. క్రికెట్‌లో బ్యాట్‌కు బంతి తగిలిందా? లేదా? అనేది తెలుసుకోవడం కోసం ఉపయోగించే ఈ సాంకేతికతను గోల్ నిర్ధరణకు వాడారు. సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన మాట్టియాస్ స్వాన్‌బెర్గ్ 18 సెకన్లలోనే గోల్ కొట్టగానే స్వీడన్ ఆటగాళ్లు సంబురాల్లో మునిగిపోయారు. అయితే.. అసిస్టెంట్ రిఫరీ మాత్రం కార్డు చూపిస్తూ గోల్ కాదని చెప్పాడు. దాంతో, స్వీడన్ ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేశారు. అలెగ్జాండర్ ఇజాక్ కాలు సైతం తగిలినట్టు అనిపించడంతో గోల్ కొట్టింది ఎవరు? అనేది తేల్చడం కోసం రిఫరీలు స్నికో మీటర్ సాయం తీసుకున్నారు. స్నికోలో ఇజాక్ కాలు దాటిన తర్వాత స్పైక్ కనిపించింది. సో.. ఆ గోల్ కొట్టింది స్వాన్‌బెర్గ్ అని తేలింది.







## నితిన్-లికితా జోడికి స్వర్ణం

పుణే వేదికగా జరిగిన ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్లు సత్తా చాటారు. హైదరాబాద్‌లోని సుచిత్రా బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన నితిన్ కుమార్-లికితా శ్రీవాస్తవ జోడీ మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణ పతకం సాధించింది. టోర్నీలో పాల్గొన్న టాప్ జోడీ షట్లర్లను ఓడించిన ఈ జోడీ తొలి స్థానంలో నిలిచి టైటిల్ కైవసం చేసుకుంది. కాగా నితిన్-లికితా జోడికి ఇది వరుసగా రెండో మిక్సడ్ డబుల్స్ టైటిల్ కావడం విశేషం. ఇటీవలే మరో జాతీయ టోర్నీలోనూ ఈ జోడీ గోల్డ్ మెడల్ గెలవడం విశేషం. మహిళల డబుల్స్ విభాగంలో లికితా శ్రీవాస్తవ తన పార్టనర్ శ్రేయ బాలాజీతో కలిసి సిల్వర్ మెడల్ గెలుచుకుంది. ఓవరాల్‌గా హైదరాబాద్‌లోని సుచిత్రా బ్యాడ్మింటన్ అకాడమీ ఆటగాళ్లను ప్రోత్సహిస్తూ జాతీయ స్థాయిలో పతకాలు కొల్లగొట్టేలా చేయడంలో విజయవంతమయ్యింది.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# అభివృద్ధి.. ఆగమాగం!

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి దేశంలో వేగంగా ఎదుగుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఐటీ, ఔషధ పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల ఆకర్షణ వంటి రంగాల్లో రాష్ట్రం ప్రత్యేక ముద్ర వేసింది. అయితే గత కొంతకాలంగా అభివృద్ధి వేగం, ప్రజల జీవన వ్యయం, పాలనా ప్రాధాన్యతలపై చర్చలు ఎక్కువవుతున్నాయి. ముఖ్యంగా ద్రవ్యోల్బణం పెరగడం, కొన్ని ప్రాజెక్టుల అమలు లో జాప్యం, విధానాలపై స్పష్టత లేకపోవడం వంటి అంశాలు నాయకత్వ సామర్థ్యంపై ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఇటీవలి గణాంకాల ప్రకారం తెలంగాణలో రిటైల్ ద్రవ్యోల్బణం దేశంలోనే అత్యధిక స్థాయిలో నమోదైన నెలలు ఉన్నాయి. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల సామాన్య కుటుంబాలపై అదనపు భారం మోపు తోంది. అయితే ద్రవ్యోల్బణానికి వాతావరణ పరిస్థితులు, సరఫరా వ్యవస్థలు, జాతీయ-అంతర్జాతీయ మార్కెట్ ప్రభావాలు వంటి అనేక కారణాలు కూడా ఉంటాయని గుర్తుంచుకోవాలి. అయితే ప్రజలు ప్రభుత్వాన్ని కేవలం గణాంకాలతో కాదు, తమ రోజువారీ జీవితంలో కనిపించే ఫలితాల ఆధారంగా అంచనా వేస్తారు. రహదారులు, పారిశ్రామిక పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, వ్యవసాయ మద్దతు, పట్టణ సేవలు వంటి రంగాల్లో నిర్ణయాలు ఆలస్యమైతే ఆ ప్రభావం ఆర్థిక వ్యవస్థపై పడుతుంది. బలమైన నాయకత్వం ఉన్నప్పుడు సంక్షోభాలను వేగంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుంది; నిర్ణయాల్లో అనిశ్చితి ఉంటే పెట్టుబడిదారులు, వ్యాపార వర్గాలు, ప్రజలు జాగ్రత్త ధోరణి అవలంబిస్తారు. మరోవైపు, ప్రభుత్వం భవిష్యత్ నగరాలు, మౌలిక సదుపాయాలు, భారీ పెట్టుబడులు వంటి దీర్ఘకాలిక లక్ష్యాలను ప్రకటిస్తూ అభివృద్ధి ప్రణాళికలను ముందుకు తీసుకెళ్తున్నట్లు చెబుతోంది. అందువల్ల "అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది" అనే నిర్ణయానికి రావడం కంటే, ప్రకటించిన ప్రణాళికలు ఎంత వేగంగా అమలవుతున్నాయి మరియు వాటి ఫలితాలు ప్రజలకు ఎంత మేరకు చేరుతున్నాయనే అంశాలను నిరంతరం సమీక్షించడం అవసరం. ప్రజాస్వామ్యంలో నాయకత్వం అంటే కేవలం ప్రసంగాలు కాదు; సమయానుకూల నిర్ణయాలు, పారదర్శక పరిపాలన, ధరల నియంత్రణకు చర్యలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం, ప్రజల్లో విశ్వాసాన్ని నిలబెట్టడం కూడా అంతే ముఖ్యమైనవి. తెలంగాణ వంటి అవకాశాలున్న రాష్ట్రం తన వృద్ధి వేగాన్ని కొనసాగించాలంటే రాజకీయ సంకల్పం, పరిపాలనా సామర్థ్యం, సమర్థవంతమైన అమలు యంత్రాంగం ఒకే దిశగా పనిచేయాలి. అంతిమంగా, అభివృద్ధి మరియు ద్రవ్యోల్బణం వంటి అంశాలను ఒక్క కారణానికి మాత్రమే ఆపాదించడం సరైంది కాదు. అయినప్పటికీ సమర్థ నాయకత్వం ఉంటే సమస్యలను వేగంగా గుర్తించి పరిష్కరించే అవకాశం పెరుగుతుంది. ప్రజల అంచనాలకు అనుగుణంగా ఫలితాలను అందించగల నాయకత్వమే రాష్ట్ర ప్రగతికి నిజమైన పునాది.




# భారత రక్షణలో నూతన యుగం

ప్రపంచ భద్రతా పరిస్థితులు రోజురోజుకూ సంక్లిష్టంగా మారుతున్న ఈ కాలంలో దేశ రక్షణ అనేది కేవలం సైనిక బలగాల సంఖ్యపై ఆధారపడే అంశం కాదు. సాంకేతిక పరిజ్ఞానం, స్వదేశీ పరిశోధనలు, కృత్రిమ మేధస్సు, అంతరిక్ష సామర్థ్యాలు, ఆధునిక ఆయుధ వ్యవస్థలు వంటి అంశాలే భవిష్యత్ యుద్ధాలను నిర్ణయించే కీలక శక్తులుగా మారాయి. ఈ నేపథ్యంలో భారత్ తన రక్షణ రంగంలో వేగంగా ముందుకు సాగుతూ కొత్త పుంతలు తొక్కుతోంది.

ఒకప్పుడు విదేశీ ఆయుధాలపై అధికంగా ఆధారపడిన భారత్, ఇప్పుడు స్వదేశీ సాంకేతికతతో ప్రపంచానికి తన సామర్థ్యాన్ని చాటుతోంది. రక్షణ పరిశోధన సంస్థలు, అంతరిక్ష విజ్ఞాన సంస్థలు, మూడు దళాల సమన్వయంతో దేశ భద్రతకు కొత్త నిర్వచనం తీసుకొస్తున్నాయి. దేశీయంగా రూపుదిద్దుకుంటున్న క్షిపణి వ్యవస్థలు, డ్రోన్లు, యాంటీ డ్రోన్ సాంకేతికత, రాడార్ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సామర్థ్యాలు భారత రక్షణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేస్తున్నాయి. డీఆర్‌డీవో అభివృద్ధి చేస్తున్న అధునాతన క్షిపణులు, యుద్ధ వాహనాలు, స్వదేశీ సెన్సార్ వ్యవస్థలు భారత సైన్యానికి సాంకేతిక ఆధిక్యాన్ని అందిస్తున్నాయి. అదే సమయంలో ఇస్రో రూపొందిస్తున్న ఉపగ్రహ వ్యవస్థలు సరిహద్దుల పర్యవేక్షణ, కమ్యూనికేషన్, నావిగేషన్, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో రక్షణ దళాలకు అమూల్యమైన సహకారం అందిస్తున్నాయి. అంతరిక్ష సామర్థ్యాలు ఇప్పుడు జాతీయ భద్రతలో కీలక భాగంగా మారాయి. వాయుసేన కూడా ఆధునిక యుద్ధ అవసరాలకు అనుగుణంగా తన సామర్థ్యాలను విస్తరిస్తోంది. నెట్‌వర్క్ ఆధారిత యుద్ధ విధానాలు, అత్యాధునిక యుద్ధ విమానాలు, డ్రోన్ వ్యవస్థలు, ఖచ్చితమైన దాడి సామర్థ్యాలు భారత వైమానిక శక్తిని మరింత బలోపేతం చేస్తున్నాయి. భవిష్యత్ యుద్ధాల్లో వేగం, సమాచార ఆధిపత్యం, సాంకేతిక ఆధిక్యమే విజయాన్ని నిర్ణయిస్తాయనే వాస్తవాన్ని భారత్ సమర్థంగా అర్థం చేసుకుంటోంది. "ఆత్మనిర్భర్ భారత్" లక్ష్యంతో రక్షణ రంగంలో స్వదేశీ తయారీకి ప్రాధాన్యం ఇవ్వడం మరో విశేషం. దీని వల్ల విదేశీ దిగుమతులపై ఆధారపడటం తగ్గడమే కాకుండా దేశీయ పరిశ్రమలకు ఊతం లభిస్తోంది. ప్రైవేట్ రంగం, స్టార్టప్‌లు, విద్యాసంస్థలు కూడా రక్షణ ఆవిష్కరణల్లో భాగస్వాములు కావడం ద్వారా పరిశోధనకు కొత్త ఊపు వస్తోంది. ఇది ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు భారత ఆర్థిక వ్యవస్థకు కూడా బలం చేకూరుస్తోంది. అయితే సాంకేతిక పురోగతి ఒక్కటే సరిపోదు. పరిశోధనకు నిరంతర నిధులు, నైపుణ్య అభివృద్ధి, పరిశ్రమ--పరిశోధన సంస్థల సమన్వయం, వేగవంతమైన ఉత్పత్తి సామర్థ్యాలు కూడా సమానంగా అవసరం. ప్రపంచ స్థాయి పోటీలో నిలవాలంటే సైబర్ భద్రత, కృత్రిమ మేధస్సు, క్వాంటమ్ సాంకేతికత, స్వయంచాలక యుద్ధ వ్యవస్థలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. భారత రక్షణ వ్యవస్థలో జరుగుతున్న ఈ మార్పులు కేవలం ఆయుధాల అభివృద్ధికి మాత్రమే పరిమితం కావు. ఇవి దేశ ఆత్మవిశ్వాసానికి, శాస్త్రీయ సామర్థ్యానికి, వ్యూహాత్మక స్వావలంబనకు ప్రతీకలు. స్వదేశీ ఆవిష్కరణలను నిరంతరం ప్రోత్సహిస్తూ, విజ్ఞానాన్ని జాతీయ భద్రతతో అనుసంధానిస్తే భారత్ రాబోయే దశాబ్దాల్లో ప్రపంచ రక్షణ రంగంలో అగ్రగామి దేశంగా నిలిచే అవకాశాలు మరింత బలపడతాయి. ఇదే నిజమైన సురక్షిత, స్వావలంబన భారత నిర్మాణానికి బలమైన పునాది.



శశిధర్ అక్కెల

# నడిపిస్తేనే నాయకుడు!

గత మూడు దశాబ్దాల్లో భారతదేశంతో పాటు ప్రపంచ రాజకీయ వ్యవస్థలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఒకప్పుడు రాజకీయ నాయకత్వానికి పార్టీ సిద్ధాంతాలు, ఉద్యమాల చరిత్ర, క్రమశిక్షణ ప్రధాన ప్రమాణాలుగా ఉండేవి. కానీ ప్రపంచీకరణ, సాంకేతిక విప్లవం, డిజిటల్ మీడియా విస్తరణతో ప్రజల అంచనాలు మారాయి. నేడు నాయకుడి చురుకుదనం, నిర్ణయ సామర్థ్యం, సంక్షోభాలను ఎదుర్కొనే నైపుణ్యం, ప్రజలతో నిరంతర అనుసంధానం వంటి అంశాలకే ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. ఈ నేపథ్యంలో "డైనమిక్ లీడర్" భావన రాజకీయాల్లో కేంద్ర స్థానాన్ని సంపాదించింది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం



డైనమిక్ నాయకత్వం అంటే మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా స్పందించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం, ప్రజల అభిప్రాయాలను వేగంగా గ్రహించడం, సమయోచిత నిర్ణయాలు తీసుకోవడం. గతంలో సభలు, ర్యాలీలు రాజకీయ కమ్యూనికేషన్‌కు ప్రధాన సాధనాలైతే, ఇప్పుడు సోషల్ మీడియా, డిజిటల్ వేదికలు, ప్రత్యక్ష ప్రసారాలు నాయకత్వ శైలినే మార్చేశాయి. ప్రజలు ప్రతి చర్యను క్షణాల్లో విశ్లేషించే కాలంలో నాయకులు ఎప్పటికప్పుడు ప్రజలతో అనుసంధానంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది. భారత రాజకీయాల్లో కూడా వ్యక్తిత్వ ఆధారిత నాయకత్వానికి ప్రాధాన్యం పెరిగింది. ముఖ్యంగా యువ ఓటర్లు అభివృద్ధి, ఉపాధి, డిజిటల్ సేవలు, పారదర్శక పాలన, వేగవంతమైన నిర్ణయాలను కోరుతున్నారు. పార్టీ కంటే నాయకుడి పనితీరు, అమలు సామర్థ్యం, ఫలితాలే ఓటర్ల నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా కూడా ఎన్నికల ప్రచారాల్లో నాయకుల వ్యక్తిగత బ్రాండ్ కీలక పాత్ర పోషిస్తోంది. కోవిడ్-19 మహమ్మారి డైనమిక్ నాయకత్వం అవసరాన్ని మరింత స్పష్టంగా చూపించింది. ఆరోగ్య, ఆర్థిక, విద్యా సంక్షోభాల మధ్య వేగంగా స్పందించిన ప్రభుత్వాలకు ప్రజల మద్దతు లభించగా, ఆలస్యమైన చర్యలు తీసుకున్న నాయకత్వాలు విమర్శలను ఎదుర్కొన్నాయి. దీనివల్ల సంక్షోభ నిర్వహణలో చురుకుదనం రాజకీయ విజయానికి ముఖ్య ప్రమాణంగా మారింది. డిజిటల్ విప్లవం రాజకీయాలను పూర్తిగా మార్చింది. సోషల్ మీడియా విస్తరణతో ప్రజలు నేరుగా నాయకులతో సంభాషించే అవకాశం పొందారు. అదే సమయంలో నాయకులపై ప్రజల పరిశీలన కూడా పెరిగింది. పారదర్శకత, బాధ్యతాయుత పాలన, వెంటనే స్పందించే సామర్థ్యం ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడంలో కీలకంగా మారాయి. అయితే డైనమిక్ నాయకత్వం కేవలం వేగవంతమైన నిర్ణయాలకు మాత్రమే పరిమితం కాదు. దీర్ఘకాలిక దృష్టి, సమతుల్య ఆలోచన కూడా అంతే అవసరం. తక్షణ ప్రజాదరణ కోసం తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో సమస్యలకు దారితీయవచ్చు. అందువల్ల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సామాజిక న్యాయం, ఆర్థిక స్థిరత్వం మధ్య సమన్వయం సాధించే నాయకత్వమే స్థిరమైన ఫలితాలను అందించగలదు.

భారతదేశ రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే స్వాతంత్ర్య ఉద్యమం నుంచి ఆర్థిక సంస్కరణలు, ఐటీ విప్లవం, డిజిటల్ పరిపాలన వరకు ప్రతి దశలో మార్పులకు అనుగుణంగా స్పందించిన నాయకత్వం ప్రత్యేక గుర్తింపు పొందింది. 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత అభివృద్ధి రాజకీయాలకు ప్రాధాన్యం పెరిగింది. ప్రస్తుతం ప్రజలు హామీల కంటే అమలు సామర్థ్యాన్ని, సంక్షేమ పథకాల కంటే వాటి ఫలితాలను, ప్రచారాల కంటే పరిపాలనా నాణ్యతను ఎక్కువగా పరిశీలిస్తున్నారు. ప్రపంచీకరణ కూడా ప్రజల అంచనాలను మార్చింది. ఇతర దేశాల్లోని మౌలిక సదుపాయాలు, సాంకేతిక పురోగతి, ప్రజా సేవలను చూసిన ప్రజలు తమ ప్రభుత్వాల నుంచి కూడా అదే స్థాయి పనితీరును ఆశిస్తున్నారు. ముఖ్యంగా యువత వేగవంతమైన సేవలు, ఆధునిక పరిపాలన, ఉద్యోగ అవకాశాలు, అవినీతి రహిత వ్యవస్థను కోరుతోంది. దీనికి అనుగుణంగా స్పందించే నాయకత్వమే ప్రజాదరణ పొందుతోంది. సాంకేతిక పరిజ్ఞానం ప్రభుత్వ సేవలను కూడా వేగవంతం చేసింది. డిజిటల్ చెల్లింపులు, నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నిధుల జమ, ఆన్‌లైన్ సేవలు, డేటా ఆధారిత పరిపాలన వంటి వ్యవస్థలను సమర్థంగా వినియోగించే నాయకత్వం ప్రజల విశ్వాసాన్ని పెంచుతోంది. భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు, డేటా విశ్లేషణ, స్మార్ట్ పరిపాలన రాజకీయ నిర్ణయాలపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే అధిక వ్యక్తి కేంద్రిత రాజకీయాలు ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరిచే ప్రమాదం కూడా ఉంది. వేగవంతమైన నిర్ణయాలతో పాటు చర్చలు, సంప్రదింపులు, రాజ్యాంగ విలువలు, సంస్థాగత సమతుల్యత కూడా ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకం. నిజమైన డైనమిక్ నాయకుడు వ్యక్తిగత చురుకుదనంతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసే దిశగా పనిచేయాలి.

రాజకీయాలు కేవలం అధికార సాధనమే కాదు; దేశ భవిష్యత్తును మలిచే వ్యవస్థ. నేటి ప్రజలు అవగాహనతో ఉన్నారు. సమాచారం క్షణాల్లో అందుబాటులోకి వస్తోంది. అందువల్ల నాయకులు నిరంతరం నేర్చుకుంటూ, ప్రజలతో అనుసంధానమై, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విధానాలను సవరించుకోవాల్సి ఉంటుంది.

ఎన్నికల్లో గెలవడం మాత్రమే కాకుండా ప్రజల అంచనాలను నెరవేర్చడం, సామాజిక సామరస్యాన్ని కాపాడడం, ఆర్థిక అవకాశాలను పెంచడం, భవిష్యత్ తరాల కోసం స్థిరమైన అభివృద్ధికి పునాది వేయడం కూడా నాయకత్వ బాధ్యతే. మొత్తంగా చూస్తే డైనమిక్ నాయకత్వానికి పెరుగుతున్న ప్రాధాన్యం తాత్కాలిక ధోరణి కాదు. ఇది సాంకేతిక విప్లవం, ప్రపంచీకరణ, యువత ఆకాంక్షలు, అభివృద్ధి రాజకీయాలు, ప్రజల పెరుగుతున్న చైతన్యం కలగలిపిన సహజ పరిణామం. అయితే ఈ చురుకుదనం ప్రజాస్వామ్య విలువలు, పారదర్శకత, బాధ్యత, దూరదృష్టి, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలతో ముడిపడి ఉన్నప్పుడే దీర్ఘకాలిక ఫలితాలను అందించగలదు. అందుకే నేటి రాజకీయాల్లోనే కాదు, రాబోయే దశాబ్దాల్లో కూడా ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునేది వేగం మాత్రమే కాదు, విలువలతో కూడిన డైనమిక్ నాయకత్వమే.


## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811


This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.